thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 64 | జగిత్యాల | గురువారం | 28 మే, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

సన్ రైజర్స్ ఔట్.. రాజస్థాన్ ఇన్



11

## ప్రతి గ్రామానికీ టిఫైబర్ ఇంటర్నెట్

- ఏబీపీ కింద రాష్ట్రంలో ప్రాజెక్టు అమలు : సీఎం రేవంత్
- కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్యతో వీసీ



2

### తుమ్మిడిహెట్టి బ్యారేజీపై అడుగు ముందుకు

- మహారాష్ట్ర ముఖ్యమంత్రికి రేవంత్ రెడ్డి లేఖ

2

## ఎస్ఐఆర్ ప్రక్రియను తిప్పికొట్టాలి

- కాంగ్రెస్ శ్రేణులకు డిప్యూటీ సీఎం భట్టి పిలుపు
- బీజేపీకి అనుకూలంగా ఉంటేనే ఓటు.. లేదంటే తొలగింపు
- సమర్థులైన బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం.
- జూన్ 30 లోగా అన్ని గ్రామ, మండల కమిటీల భర్తీ పూర్తి కావాలి



2



## గాంధీభవన్‌లో డిష్యూం.. డిష్యూం..

- చొక్కాలు పట్టుకుని మరీ కొట్టుకున్న కాంగ్రెస్ నేతలు
- ఫిరోజ్‌ఖాన్, ఉస్మాన్ అల్ హాజ్రీల మధ్య ఘర్షణ
- తోసేయడంతో కిందపడిన ఫిరోజ్‌ఖాన్
- మంత్రి అజారుద్దీన్ పక్కన కూర్చోవడంపై వివాదం
- అడ్డుకునేందుకు వెళ్లిన వీహెచ్‌కూ తోపులాట

**హైదరాబాద్, మే 27:**

హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీభవన్ బుధవారం ఉద్రిక్త పరిస్థితులకు వేదికైంది. మంత్రి మహ్మద్ అజారుద్దీన్ పక్కన కూర్చోవడంపై కాంగ్రెస్ నేతలు ఫిరోజ్‌ఖాన్, కార్వాన్ ఇన్‌చార్జ్ ఉస్మాన్ అల్ హాజ్రీల మధ్య తీవ్ర

మిగతా 2వ పేజీలో..



## రైతు డిస్కం దరఖాస్తును ఆమోదించొద్దు

- ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌కు హరీష్‌రావు లేఖ

**హైదరాబాద్, మే 27 :**

డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న దరఖాస్తుపై పలు అభ్యంతరాలు తెలుపుతూ దానిని తిరస్కరించాలంటూ  బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్

మిగతా 2వ పేజీలో..

# కమలంలో కోవర్ట్ కలకలం




- తెలంగాణ బీజేపీలో అంతర్గత రాజకీయాలపై ఢిల్లీ ఫోకస్
- కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉంటున్న నేతలపై అధిష్టానం ఆగ్రహం
- మున్సిపల్ ఎన్నికల వ్యవహారాలపై ఢిల్లీకి చేరిన నివేదికలు
- ఎమ్మెల్యేలు, ఎంపీలకు రాష్ట్ర ఇన్చార్జ్ గట్టివార్నింగ్ ఇచ్చినట్టు ప్రచారం

**న్యూఢిల్లీ/హైదరాబాద్, మే 27**

తెలంగాణ బీజేపీలో అంతర్గత విభేదాలు, కోవర్ట్ రాజకీయాలపై పార్టీ అధిష్టానం సీరియస్‌గా దృష్టి పెట్టినట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలోని కొందరు ముఖ్య నేతలు అధికార కాంగ్రెస్ పార్టీతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారన్న సమాచారంతో ఢిల్లీ పెద్దలు అప్రమత్తమైనట్టు తెలుస్తోంది. పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టిన కేంద్ర నాయకత్వం ముందు రాష్ట్ర యూనిట్‌లో క్రమశిక్షణను గాడిలో పెట్టే పనిని ప్రారంభించినట్టు సమాచారం. రాష్టంలో ఇటీవల నిర్వహించిన రైతు ఘోష బీజేపీ

మిగతా 2వ పేజీలో..



## విద్యుత్ కనెక్షన్ల ఆక్యూపెన్సీ నిబంధనల్లో మార్పు!



3

- త్వరలోనే 75 కొత్త సబ్‌స్టేషన్లు అందుబాటులోకి
- విద్యుత్ కనెక్షన్ల సమస్యకు మధ్యేమార్గంగా సరికొత్త నిబంధనలు
- జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ ప్లాన్ ప్రకారం గృహ కనెక్షన్లు
- అనుమతి లేని నిర్మాణాలకు 'కేటగిరీ-8' కింద విద్యుత్ సరఫరా
- వేసవి డిమాండ్‌ను తట్టుకునేలా 75 కొత్త సబ్‌స్టేషన్లు



## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- రైతాంగం ఆందోళన చెందొద్దు
- చివరి గింజ కొనుగోలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రూ.10,097 కోట్ల చెల్లింపులు
- రాజకీయ లబ్ధికే ప్రతిపక్షాల రాద్ధాంతం
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, మే 27 :**

తడిసిన ధాన్యాన్ని తప్పకుండా కొనుగోలు చేస్తామని, ,రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన తడిసిన ధాన్యాన్ని సత్వరమే బాయిల్డ్

మిగతా 2వ పేజీలో..



## త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

- జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు
- కేటీఆర్ సవాల్‌పై మరోమారు ఘాటు విమర్శలు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి

3

## పోలీస్ కస్టడీలో బండి భగీరథ్

- ముగిసిన తొలి రోజు విచారణ
- సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం అరణ్య ఫామ్‌హౌస్‌కు తరలింపు
- కూకట్‌పల్లి డీసీపీ ఆధ్వర్యంలో విచారణ
- మరో రెండు రోజులు కొనసాగనున్న విచారణ



3

## అకాల వర్షం.. అతలాకుతలం!

- పలుచోట్ల విరిగిన కరెంట్ స్తంభాలు...
- 365 ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- 282ఫీడర్లలో గంటలోపే విద్యుత్ పునరుద్ధరణ
- 69 ఫీడర్లలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు రెండు నుంచి ఐదు గంటల సమయం
- టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ లో విద్యుత్ పునరుద్ధరణకు శ్రమించిన కార్మికులు

**తెలంగాణ బ్యూరో, మే 27:**

తెలంగాణాలోని పలు జిల్లాలో మంగళవారం ఆకస్మికంగా కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షం బీభస్తం సృష్టించింది.గ్రేటర్ హైదరాబాద్ తో పాటు మెదక్. మేడ్చల్ మల్కాజిగిరి,రంగారెడ్డి ,సంగారెడ్డి ,సిద్దిపేట, కరీంనగర్ తో పాటు పలు జిల్లాలో భారీగా నష్టం వాటిల్లింది . ఆయా జిల్లాల పరిధిలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

మిగతా 2వ పేజీలో..



## కొనసాగుతున్న సరస్వతీ అంత్య పుష్కరాలు

- వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులు

2



# 'ఎస్ఐఆర్' ప్రక్రియను తిప్పికొట్టాలి

**ఖమ్మం, మే 27 :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా వారికి అనుకూలంగా ఉన్న వోటర్లను మాత్రమే జాబితాలో ఉంచి, అనుకూలంగా లేని వారిని వోటర్ లిస్ట్ నుంచి తొలగించటానికి 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరిట కుట్ర పూరిత ప్రక్రియను చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తీవ్రంగా ఆరోపించారు. బుధవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన జిల్లా పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

సర్ ప్రక్రియను తిప్పికొట్టటానికి కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయిలో సమర్థులైన బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలన్నారు. ఈ బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. జూన్ 30 వరకు మండల కార్యవర్గ కమిటీలు, బూత్ కమిటీలు, గ్రామ కమిటీలు,అనుబంధ సంఘ కమిటీలు పూర్తి చేయాలని చెప్పారు . పార్టీ అభివృద్ధికి అందరినీ కలుపుకొని పని చేయాలని, సామాజిక న్యాయం పాటించాలని, పార్టీ పరంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను అధికారుల ద్వారా పరిష్కరించి పార్టీ అండగా ఉంటుందనే భరోసా కల్పించాలన్నారు. ప్రతి నెల జిల్లా పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలన్నారు. నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు పదవులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడ నాగండ్ల దీపక్ చౌదరి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు,మధిర మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత, వైరా మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళ, కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, వేజండ్ల సాయి కుమార్, సయ్యద్ గౌస్, డాక్టర్ కాపా మురళి కృష్ణ,పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, మొక్క శేఖర్ గౌడ్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ లు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామానికీ టి-ఫైబర్ ఇంటర్నెట్

**హైదరాబాద్, మే 27 :** అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ (ఏబీపీ) కింద రాష్ట్రంలో టిఫైబర్ ప్రాజెక్టు అమలుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించిన ఒప్పందాన్ని త్వరితగతిన కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదలను వేగవంతం చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి జ్యోతిరాదిత్యతో చర్చించారు. కేంద్ర మంత్రి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఏబీపీ సజావుగా అమలు చేసే దిశగా ముఖ్యమంత్రి కొన్ని కీలక అంశాలను సింధి□యా దృష్టికి తీసుకువెళ్ళారు. మండలం నుండి గ్రామ పంచాయతీ రింగ్ నెట్‌వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేయడంపై స్పష్టమైన విధానం ఏర్పాటు చేయడం గురించి కూడా ప్రస్తావించారు. వీటిపై సింధియా సానుకూలంగా స్పందించారు. ప్రతి గ్రామానికీ, ప్రతి ఇంటికీ బలమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే తెలంగాణ లక్ష్య సాధనకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణ భవిష్యత్తును తీర్చిదిద్దే బలమైన నెట్‌వర్క్ కోసం ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడం, కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకోవడంతో నిజమైన డిజిటల్ తెలంగాణకు పునాది పడనుంది. టీఫైబర్ నెట్‌వర్క్ ప్రతి గ్రామ పంచాయతీని రింగ్ ఆర్కిటెక్చర్ ద్వారా అనుసంధానించనుంది. రింగ్ ఆర్కిటెక్చర్ ద్వారా ఒక మార్గంలో అంతరాయం ఏర్పడినా ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సేవలు నిరంతరం కొనసాగుతాయి. తద్వారా గ్రామీణ తెలంగాణకు నిజమైన నిరంతర హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ అందనుంది. మొదటి దశలో దెబ్బతిన్న నెట్‌వర్క్ ఉన్న ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లోని 3,089 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరించనున్నారు. ఏబీపీ కింద ఈ గ్రామాలను ఆధునిక, భవిష్యత్తు అవసరాలకు సరిపడే ఫైబర్ మౌలిక సదుపాయాలతో రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలతో సమానంగా అనుసంధానిస్తారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ డి.అనుదీప్, ఉన్నతాధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

# కమలంలో కోవర్ట్ కలకలం

**మొదటిపేజీ తరువాయి**

భరోసా కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులంతా ఒకే వేదికపై కనిపించడం వెనుక కూడా అధిష్టానం సూచనలు ఉన్నాయన్న ప్రచారం సాగుతోంది. గత కొంతకాలంగా రాష్ట్ర నేతల మధ్య వర్గపోరు, సమన్వయ లోపం పార్టీ కార్యకర్తల్లో అసంతృప్తికి దారితీసిందని ఢిల్లీ పెద్దలు భావిస్తున్నట్టు చెబుతున్నారు.

ప్రధానంగా ఐదు జిల్లాల్లో కొందరు నేతలు కోవర్ట్ రాజకీయాలకు పాల్పడుతున్నారన్న నివేదికలు పార్టీ అధిష్టానం దృష్టికి వెళ్లినట్టు సమాచారం. మున్సిపల్ ఎన్నికల సమయంలో పార్టీ తరఫున చురుకుగా పని చేయకుండా ఇతర పార్టీలతో సయోధ్యకు వెళ్లారన్న ఆరోపణలపై కూడా సమగ్ర సమాచారం సేకరించినట్టు తెలుస్తోంది. పార్టీకి నష్టం కలిగించే చర్యలను ఇకపై సహించబోమని రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ స్పష్టం చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

కాంగ్రెస్ నాయకులతో వేదికలు పంచుకోవడం, ముఖ్యమంత్రి కార్యక్రమాలకు అవసరం లేకున్నా హాజరుకావడంపై కూడా అధిష్టానం అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. తమ నియోజకవర్గ పరిధిలో అధికారిక కార్యక్రమాలకు హాజరుకావడం వరకు సమంజసమేనని, కానీ సంబంధం లేని ప్రాంతాల్లో రాజకీయ సంకేతాలు వెళ్లేలా వ్యవహరించడం సరైంది కాదని కొందరు ఎమ్మెల్యేలకు స్పష్టమైన హెచ్చరికలు వెళ్లినట్టు తెలుస్తోంది. ఇటీవల రాష్ట్ర ఇన్చార్జ్ అభయ్ పాటిల్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించిన సమయంలోనే ఈ అంశాలపై గట్టిగా మాట్లాడినట్టు ప్రచారం సాగుతోంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని కలవడంలో తప్పు లేదుగానీ, పార్టీ వైఖరికి విరుద్ధంగా కనిపించే చర్యలు కార్యకర్తల్లో గందరగోళానికి దారితీస్తాయని ఆయన సూచించినట్టు తెలిసింది.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మరింత దూకుడుగా పోరాటం చేయాలని, పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని అధిష్టానం సంకేతాలు ఇచ్చినట్టు కమల శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.

## తుమ్మిడిహెట్టి బ్యారేజీపై
# అడుగు ముందుకు



**హైదరాబాద్, మే 27 :** తుమ్మిడి హెట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగు ముందుకేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. తమ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలని, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. బి.ఆర్.అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడి హెట్టి వద్ద బ్యారేజీ నిర్మించాల్సి ఉంది. మొదటి ప్రతిపాదనలో ఈ బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించాలనుకున్నారు. 2016 ఆగస్టు 23న జరిగిన ఇంటర్ స్టేట్ బోర్డు సమావేశంలో తుమ్మిడి హెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అవసరమైన అనుమతులకు సహకారం అందిస్తామని కూడా అప్పట్లో తెలిపింది. ఇటీవల ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయించిన తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాన్ని పున:సమీక్షించింది. 148 మీటర్ల ఎఫఆరఎల్ ఉత్తర తెలంగాణ నీటి అవసరాలకు సరిపోదని నిపుణుల సూచనలతో అంచనాకు వచ్చింది. అందుకే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడి హెట్టి బ్యారేజీ ఎత్తుపై మరోసారి చర్చ అవసరమని సీఎం రేవంత్ రెడ్డి తన లేఖలో ప్రస్తావించారు. 148 మీటర్ల కంటే కొంత ఎక్కువ ఎఫఆరఎల్ పరిశీలించినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని సీఎం వివరించారు. ఎఫఆరఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీటిని తెచ్చుకునే వీలుందని ప్రస్తావించారు.

## రైతు డిస్కం
# దరఖాస్తును ఆమోదించొద్దు



**మొదటిపేజీ తరువాయి**

(ఈఆర్‌సీ)కు లేఖ రాశారు. తెలంగాణ సమాజంలో రైతులను, విద్యుత్‌ను విడదీసి చూడలేం.. నాటి ఉమ్మడి పాలకులు అమలు చేసిన విద్యుత్తు సంస్కరణలే బషీర్‌బాగ్ కాల్పులకు దారితీశాయన్న విషయం విదితమేనన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం విద్యుత్తు రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి భారీగా నిధులు కేటాయించి ఆ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా 2018 జనవరి 1 నుంచి దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రైతాంగానికి నిరంతర, నాణ్యమైన ఉచిత విద్యుత్తును కేసీఆర్ అందించారన్నారు. ఫలితంగా వరి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనాలోచిత నిర్ణయాలతో విద్యుత్తు రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. రైతు డిస్కం పేరిట మూడో డిస్కం ఏర్పాటు చేస్తామని ప్రకటించి రైతులు సహా అన్ని వర్గాల ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తోందన్నారు. ఆచరణ సాధ్యం కాని విధానాలతో విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరణ దిశగా నడిపించే కుట్ర జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ ప్రతిపాదనలోని పలు లోపాలను ఆ లేఖ ద్వారా కమిషన్ దృష్టికి తీసుకె=ళ్ళారు. బహిరంగ విచారణ పూర్తి కాకముందే జూన్ 2 నుంచి రైతు డిస్కం ప్రారంభమవుతుందని ప్రభుత్వం ప్రకటించడం విచారణ పూర్తికాకుండానే తీర్పు చెప్పినట్లుగా కనిపిస్తోందని ఆరోపించారు. రైతు డిస్కం కావాలి అని రైతులు అడగలేదు.. రైతు సంఘాలు అడగలేదు.. ప్రజాప్రతినిధులు అడగలేదు.. కేబినెట్ సబ్ కమిటీ నివేదిక లేదు.. విద్యుత్ సంస్థల నుండి ప్రతిపాదన లేదు.. మరి ఆర్థికపరమైన అంశాలు జి.ఓ.44లో పేర్కొంటూ మూడో డిస్కం ఏర్పాటు చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. జీవో 44 పేరా 2లో యావరేజ్ బిల్లింగ్ రేటు, యావరేజ్ కాస్ట్ ఆఫ్ సర్వీస్‌లో వ్యత్యాసం ఉందని, దీని వల్ల డిస్కంలు ఆర్థికంగా కుంగిపోతున్నాయని చెప్పారు.. అంటే థర్డ్ డిస్కం ఏర్పాటు ఆర్థికపరమైన విషయాల గురించి ఆలోచించి చేస్తున్నారు తప్ప రైతుల సంక్షేమం గురించి కాదని అర్థం అవుతోందని అన్నారు. ఈ కీలక నిర్ణయంపై అసెంబ్లీలో చర్చించకపోవడం దీనికి మరింత బలం చేకూరుస్తున్నదన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం, విస్తృత చర్చ నిర్వహించడం కమిషన్ బాధ్యతగా తాము భావిస్తున్నామని హరీష్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల వినియోగదారులపై ప్రభావం చూపే ఈ నిర్ణయంపై బహిరంగ విచారణను కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయడం సమంజసం కాదన్నారు. అన్ని జిల్లాల్లో రైతులు, ఉద్యోగులు, వినియోగదారులతో బహిరంగ విచారణలు నిర్వహించాలని కమిషన్‌ను కోరుతున్నామన్నారు.

# అకాల వర్షం.. అతలాకుతలం!

**మొదటిపేజీ తరువాయి**



గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 11 కేవీకి చెందిన 263 ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రధానంగా గ్రేటర్ పరిధిలోని పది సర్కిళ్ల పరిధిలో విద్యుత్ అంతరాయం జరిగింది. విద్యుత్ అధికారులు యుద్ధ ప్రతిపాదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. 214 ఫీడర్లలో గంట లోపే విద్యుత్ పునరుద్ధరించగా, మరో 49 ఫీడర్లలో విద్యుత్ పునరుద్ధరణకు రెండు నుంచి ఐదు గంటల సమయం పట్టింది. గ్రేటర్ పరిధిలో 39 డీటీఆర్‌లు పెయిలయ్యాయి. 20 నుంచి 25 విద్యుత్ స్థంభాలు విరిగిపడ్డాయి. ఇనుప విద్యుత్ స్తంభాలు సైతం వంగిపోయాయి. ఒక వైపు, మరోవైపు బలమైన ఈదురు గాలిలో కూడా విద్యుత్ సిబ్బంది రాత్రి 11 గంటల నుంచి తెల్లవారు జామున నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాను పూర్తిగా పునరుద్ధరించారు. మంగళవారం రాత్రి భారీ వర్షంతో పాటు బలంగా వీచిన ఈదురు గాలులతో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ స్థంభాలపై , విద్యుత్ తీగలపై పడడంతో డిస్క్‌లు , ఇన్సూలేటర్లు పగిలిపోయాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మేడ్చల్ జిల్లాలో 11 కేవీకి చెందిన 53 ఫీడర్లలో సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలో 11 కేవీకి చెందిన 57 ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బంజారా హిల్స్ సర్కిల్ పరిధిలో 11 కేవీకి చెందిన 17 ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కాగా, సెంట్రల్ సర్కిల్ పరిధిలో 51కి పైగా ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సికింద్రాబాద్ సర్కిల్‌లో 20 ఫీడర్లలో, హైదరాబాద్ సర్కిల్‌లో 65 ఫీడర్లలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి రాత్రి 11 గంటల నుంచే విద్యుత్ పునరుద్ధరణ పనులను చేపట్టారు. తక్కువ తీవ్రత ఉన్న ప్రాంతాలలో రెండు నుంచి మూడు గంటల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగా, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బ తిన్న ప్రాంతాలలో, విద్యుత్ తీగలు తెగి పడిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా పనులు కొంత ఆలస్యం అయ్యాయి. తెల్లవారు జామున నాలుగు గంటల వరకు అన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పడిన విద్యుత్ అంతరాయం తొలగించడానికి 12 గంటలు పట్టింది. రాత్రంతా విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ పునరుద్ధరకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. అలాగే 6 జిల్లాలలోని ప్రధాన పట్టణాల్లో రాత్రంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది .టీజీఎస్పీడీసీఎల్ పరిదిలోని కరీంనగర్, మెట్పల్లి తో పలు ప్రాంతాల్లోనూ వర్ష బీభస్తానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది.అధికారులు అంతరాయాన్ని తొలిగించేందుకు 10 గంటల సమయం పట్టింది .ఎండల తీవ్రత పెరగడంతో వేడి, ఉక్కపోత పెరిగింది. దోమల బెడద కూడా ఉండడం, అకాల వర్షంతో ఏర్పడిన విద్యుత్ అంతరాయంతో జనాలు రాత్రి పూట జాగరణ చేయాల్సి వచ్చింది. పిల్లలు ఉక్కపోతకు కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అకాల వర్షాల నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎండీ జితేష్ వి పాటిల్ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ లు కర్నాటి వరుణ్ రెడ్డిలు అధికారులను ఆదేశించారు.

# గాంధీభవన్‌లో డిష్యూం.. డిష్యూం..

**మొదటిపేజీ తరువాయి**



ఘర్షణ చోటుచేసుకుంది. మొదట మాటల యుద్ధంగా ప్రారంభమైన వివాదం క్రమంగా ఉద్రిక్తంగా మారింది. ఒకరి చొక్కాలు ఒకరు పట్టుకుని తోపులాటకు దిగారు. ఈ క్రమంలో ఉస్మాన్ అల్ హజ్రీ ఆగ్రహంతో ఫిరోజ్‌ఖాన్‌ను గట్టిగా తోసేయడంతో ఆయన కిందపడిపోయారు. సీనియర్ నేతల సమక్షంలోనే ఈ ఘటన జరగడంతో అక్కడ ఉన్న కాంగ్రెస్ శ్రేణులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాయి. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతుండటంతో సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు వెంటనే జోక్యం చేసుకుని ఇరువర్గాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు.అయితే ఆవేశంలో ఉన్న నేతలు వీహెచ్‌ను కూడా పక్కకు తోసే ప్రయత్నం చేయడంతో పరిస్థితి మరింత వేడెక్కింది. వెంటనే ఇతర కాంగ్రెస్ నాయకులు, భద్రతా సిబ్బంది మధ్యలోకి దిగి ఇరువర్గాలను విడదీశారు. దీంతో గాంధీభవన్‌లో ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగాయి.

# కొనసాగుతున్న సరస్వతీ అంత్య పుష్కరాలు

**కాళేశ్వరం, మే 27:** కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు భక్తులు పోటెత్తుతున్నారు. పుష్కరఘాట్‌ల వద్ద తెల్లవారు జాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. వేద మంత్రోచ్చారణలు, హారతులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కాళేశ్వర క్షేత్రం మార్మోగుతోంది. ఈ నెల 21న ప్రారంభమైన పుష్కరాల్లో భక్తులు రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాక మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందించి పుష్కరాల ప్రాముఖ్యతను వివరించారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు పుష్కర స్నానమాచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో సకల ఐశ్వర్య ప్రాసస్థ్యం దుర్గ సూక్త హోమం అత్యంత వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి సెట్టింగ్‌ను చూసి మురిసిపోయిన భక్తులు సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. సరస్వతి పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సరస్వతి మాత, శివుని విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే పిల్లలు ఆడుకోవడానికి ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎగ్జిబిషన్ చూపరులను మంత్రముగ్ధులను చేస్తోంది. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మంగళ, గురువారాల్లో కాల సర్ప దోష పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పుష్కరాల నేపథ్యంలో ఆ పూజలను తాత్కాలికంగా నిలిపివేశారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

**మొదటిపేజీ తరువాయి**

రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు. అకాల వర్షాలకు తడిసిన 9,214 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు ఆయన వెల్లడించారు. అకాల వర్షాలు సంభవించడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉత్పన్నమైన పరిణామాలను సమీక్షించేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అత్యవసరంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రివర్గ సహచరులు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, కలెక్టర్లు, పోలీస్ అధికారులు, రవాణా శాఖాధికారులు, పౌర సరఫరాల శాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగానికి నష్టం వాటిల్లే ఏ చర్యలనూ ప్రభుత్వం చూస్తూ ఊరుకొబోదన్నారు. ఇది రైతు పక్షపాత ప్రభుత్వం అని, చివరి గింజ వరకు కొనుగోలుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో అదీ రబీ సీజన్‌లో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ఉపక్రమించిందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 66.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం చేరగా అందులో 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.10,097 కోట్లను చెల్లించినట్లు వెల్లడించారు. దీనివల్ల 8.15 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరిందన్నారు. కొనుగోలులో రాష్ట్రం సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు. కొనుగోలు చేసిన 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 44.67 లక్షల మెట్రిక్ టన్నులు సాధారణ రకాల ధాన్యం కాగా 12.33 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలని మంత్రి ఉత్తమ్ వివరించారు. ఇసుక సరఫరా చేసే లారీలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మళ్లించి సత్వరమే ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ముందెన్నడూ లేని రీతిలో 8575 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తుంటే రాజకీయాల కోసం ప్రతిపక్షాలు రాద్ధాంతం చేసి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ రైతాంగానికి ఎక్కడా ఆటంకాలు ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ స్పష్టం చేశారు.

**హెల్ప్ లైన్ నెంబరు 1967**

తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుందంటూ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసింది. రైతులకు ఎలాంటి నష్టం లేకుండా పంట మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపింది. అన్ని కొనుగోలు కేంద్రాల్లో పంట కొనుగోలు సాఫీగా సాగుతొందంటూ రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ఈమేరకు హెల్ప్ లైన్ నెంబరు 1967 కేటాయించి ఏదైనా సమస్య ఉంటే సంప్రదించాలని సూచించింది.

# విద్యుత్ కనెక్షన్ల 'ఆక్యూపెన్సీ' నిబంధనల్లో మార్పు!

తెలంగాణ బ్యూరో:

తెలంగాణ రాష్ట్రంలో వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ స్పష్టం చేశారు. బుధవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన 'మీడియా ఇంటరాక్షన్' ప్రోగ్రాంలో ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు వీలుగా త్వరలోనే రాష్ట్రంలో 75 కొత్త సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్డింగ్ ఆక్యూపెన్సీ సర్టిఫికేట్ విద్యుత్ కనెక్షన్ల సమస్యకు వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా మధ్యేమార్గంగా నిబంధనలను సవరించినట్లు వెల్లడించారు.

**ఆక్యూపెన్సీ నిబంధనల సవరణ..**

హైదరాబాద్ మహానగర పరిధిలో ఆక్యూపెన్సీ సర్టిఫికేట్ సమస్య కారణంగా నిలిచిపోయిన విద్యుత్ కనెక్షన్ల విషయంలో సంస్థ సానుకూల నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ లేదా హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం ప్లాన్ అనుమతులతో ఇళ్లు నిర్మించిన వారికి యథావిధిగా గృహ కనెక్షన్లు ఇస్తామని సీఎండీ తెలిపారు. 10 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలకు మాత్రమే ఆక్యూపెన్సీ సర్టిఫికేట్ అవసరమని, స్వల్ప డివియేషన్లను (నిర్మాణ మార్పులను) తాము పట్టించుకోబోమని స్పష్టం చేశారు. భవనం ముందు భాగంలో కాకుండా ఇరుపక్కల లేదా వెనుక వైపు డివియేషన్లు ఉంటే.. యజమానులు జీహెచ్ఎంసీ అధికారులను కలిసి ఫీజు చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవచ్చని సూచించారు. అయితే, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలకు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కేవలం 'కేటగిరీ 8' కింద మాత్రమే విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని స్పష్టం చేశారు.

**స్టోర్స్ మెటీరియల్‌పై కఠిన నిఘా..**

డిపార్ట్‌మెంట్ పనుల కోసం విద్యుత్ స్టోర్స్ నుంచి విడుదలవుతున్న మెటీరియల్ పక్కదారి పడుతుందనే సమాచారంతో సీఎండీ కఠిన నిబంధనలు తీసుకువచ్చారు. ఇకపై సెక్షన్ల వారీగా చేపట్టే ప్రతి పనికి 'ఎస్టిమేషన్' పూర్తి స్థాయిలో తయారైన తర్వాతనే స్టోర్స్ నుండి మెటీరియల్ విడుదలవుతుందని స్పష్టం చేశారు. స్టోర్స్ నుంచి 80 శాతం మెటీరియల్ డ్రా చేసి కూడా సకాలంలో పనులు పూర్తి చేయకపోతే సదరు అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మార్కెట్‌లో మీటర్ల కొరత ఉందనే ప్రచారాన్ని ఆయన ఖండించారు. కాలిపోయిన, ఆగిపోయిన మీటర్ల స్థానంలో వేయడానికి కొత్త మీటర్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని, ఎవరైనా మీటర్లు లేవని చెబితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

**రెప్పపాటు కరెంట్ పోనివ్వం..**

ఎండాకాలం మరియు వర్షాకాలం విద్యుత్ డిమాండ్‌ను, ఈదురు గాలులను తట్టుకునేలా విద్యుత్ లైన్లను తీర్చిదిద్దుతున్నట్లు జితేష్ వి పాటిల్ తెలిపారు. కొత్తగా నిర్మించిన 33 కేవీ సబ్‌స్టేషన్ల పనులు పూర్తయ్యాయని, వచ్చే నెలలోనే 75 సబ్‌స్టేషన్లను చార్జ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. జూన్ నెలలో 132 కేవీ, 33 కేవీ, ఎల్‌టీ లైన్ల బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు ఇప్పటికే పూర్తయిందని చెప్పారు. అధిక లోడు ఉన్న ఫీడర్లు, డీటీఆర్‌లను గుర్తించి అదనపు సామర్థ్యం గల పీటీఆర్‌లను ఏర్పాటు చేస్తున్నామని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని భరోసా ఇచ్చారు. అండర్‌గ్రౌండ్ కేబుళ్ల కొరత తీర్చేందుకు టెండర్లు ఆహ్వానించామన్నారు.

**టర్న్‌కీ విధానంలో మార్పులు!**

టర్న్‌కీ విధానాన్ని ఎత్తివేసిన తర్వాత వినియోగదారులకు సేవలలో కొంత ఆలస్యం జరుగుతున్న మాట వాస్తవమేనని అంగీకరించిన సీఎండీ, దాన్ని అధిగమించడానికి కాంట్రాక్టర్ల పనుల కేటాయింపులో కొత్త మార్పులు చేశారు. వెండర్ కాంట్రాక్టర్లతో పాటు టర్న్‌కీ పద్ధతిలో పనిచేసే కాంట్రాక్టర్లందరికీ సమానంగా పనులు కల్పిస్తామన్నారు. అయితే, ఏ ఒక్క కాంట్రాక్టర్‌కు ఒకేసారి మూడు కంటే ఎక్కువ పనులు అప్పగించబోమని, ఆ మూడు పనులు పూర్తి చేసిన తర్వాతే కొత్త పనులు ఇస్తామన్నారు. గతంలో టర్న్‌కీ ఒప్పందాలు చేసుకున్న వారు కొత్త నిబంధనల ప్రకారం కిలోవాట్‌కు రూ.10 వేల చొప్పున చెల్లించి పనులు చేయించుకోవచ్చని, వీరికి జూన్ 15 వరకు సమయం ఉందని తెలిపారు. అలాగే, ప్రత్యేకంగా డెడికేటెడ్ లైన్, డీటీఆర్ కావాలనుకునే వినియోగదారులు అందుకు సంబంధించిన ప్రత్యేక నిధులు చెల్లిస్తే తక్షణమే ఏర్పాటు చేయడానికి సంస్థ సిద్ధంగా ఉందని సీఎండీ జితేష్ వి పాటిల్ వెల్లడించారు.

# పోలీస్ కస్టడీలో బండి భగీరథ్

- ముగిసిన తొలిరోజు విచారణ
- సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం అరణ్య ఫామ్‌హౌస్‌కు తరలింపు
- కూకట్‌పల్లి డీసీపీ ఆధ్వర్యంలో విచారణ
- కోర్టు అనుమతితో మూడు రోజుల పోలీస్ కస్టడీ
- మరో రెండు రోజులు కొనసాగనున్న విచారణ

హైదరాబాద్, మే 27:

పోక్సో కేసులో నిందితుడు బండి సాయి భగీరథ్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. మల్కాజిగిరి కోర్టు మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి ఇవ్వడంతో బుధవారం ఉదయం పోలీసులు భగీరథ్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

ముందుగా వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత కేసుకు సంబంధించిన సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం మొయినాబాద్‌లోని అరణ్య ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లారు. అరణ్య ఫామ్‌హౌస్‌లో ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించిన పోలీసులు, అనంతరం భగీరథ్‌ను కూకట్‌పల్లి డీసీపీ కార్యాలయానికి తరలించారు. డీసీపీ ఆధ్వర్యంలో తొలిరోజు విచారణ నిర్వహించారు. విచారణ అనంతరం మళ్లీ పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. భగీరథ్‌ను మరో రెండు రోజులు విచారించాల్సి ఉంది. కేసులో మరిన్ని వివరాలు, ఆధారాలు సేకరించే దిశగా పోలీసులు ప్రశ్నలు సంధిస్తున్నట్లు సమాచారం.

ఈ కేసులో నిందితుడిని ఏడు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరారు. అయితే కోర్టు కేవలం మూడు రోజుల పోలీస్ కస్టడీకి మాత్రమే అనుమతి ఇచ్చింది.

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

హైదరాబాద్, మే 27:

రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయని, జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. తొలి దశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం.. 13చోట్ల స్థలాలు పరిశీలించాం.. జీహెచ్ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం.. జీవనోపాధికి అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తాం అని మంత్రి పొంగులేటి వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తామని, ఒక్క రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేర రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. బీఆరఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి పది ఇళ్లు కూడా నిర్మించలేదని, తమ ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కుపైగా ఇళ్లు ఇచ్చిందని, రెండో విడతలో రెండువేల ఇళ్లు కేటాయిస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లపై బీఆరఎస్ నేత కేటీఆర్, మంత్రి పొంగులేటి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. పదేళ్ల బీఆరఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే మీరు పోటీకి దూరంగా ఉంటారా అంటూ కేటీఆర్‌కు సవాల్ విసిరారు.

# నర్సింగ్ విద్య బలోపేతానికి చర్యలు

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ సమీక్ష

హైదరాబాద్, మే 27 :

నర్సింగ్ వ్యవస్థలో వస్తున్న మార్పుల దృష్ట్యా రాష్ట్రంలో నర్సింగ్ విద్యను బలోపేతం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నర్సింగ్ కౌన్సిల్ బలోపేతంపై సచివాలయంలో బుధవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు ఈ సమీక్షలో జీఎనఎం విద్యార్థులకు తమ కెరీర్ డెవలప్‌మెంట్ కోసం పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ కాలేజీలలో ప్రవేశాలకు అనుమతి ఇవ్వాలని మంత్రి దామోదర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 10 బీఎస్సీ నర్సింగ్ కాలేజీలను, పీజీ(ఎంఎస్సీ) నర్సింగ్ కాలేజీని ఏర్పాటు చేయాలన్నారు. నర్సింగ్ కాలేజీలలో మిడ్ వైఫరీ కోర్సులను బలోపేతం చేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ పోస్టును క్రియేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. నర్సింగ్ కౌన్సిల్ కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే విద్యార్థులకు, నర్సులకు కార్యాలయ ప్రాంగణంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమీక్షలో వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యుల్లత, వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ సీఈ శశిధర్, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# 12 నుంచి బడులు ప్రారంభం

- గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం
- సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ
- అద్దె భవనాలపై సమగ్ర నివేదిక అందించాలి
- సొంత భవనాల్లో ఉన్న గురుకులాల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు
- గురుకుల, సంక్షేమ వసతి విద్యా సంస్థలపై సమీక్ష

ఖమ్మం, మే 27



రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. ఖమ్మం కలెక్టరేట్లో బుధవారం కలెక్టర్ దివా కర టిఎస్., అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తో కలిసి గు రుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై ఉప ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా గురుకుల పాఠ శాలల్లో అడ్మిషన్లు పెరిగేలా అధికారులు ప్ర త్యేక దృష్టి సారించాలని సూచించారు. సీట్లు పూర్తిగా భర్తీ కాని రెసిడెన్షియల్ పాఠశాలలపై అధ్యయనం చేసి కారణాలు గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని వసతివిద్యా సంస్థలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని తెలిపారు. వేసవిలోనే అవసరమైన మరమ్మతులు, మౌలిక వసతులను కల్పించా లని సూచించారు. ప్రతి రెసిడెన్షియల్ పాఠశా లలో డైట్ ఛార్జీలు, మెనూ వివరాలను తప్పని సరిగా ప్రదర్శించాలని తెలిపారు. ప్రతి గురు కుల విద్యాసంస్థకు ఒక జిల్లా అధికారిని ఇన్ చార్జిగా నియమించి, వారు ప్రతి నెల పాఠశాలలను సందర్శించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు రెగ్యులర్ పాఠశాలలను సందర్శించి తనిఖీ నివేదికలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించా రు. వైద్యులు కూడా ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని తెలిపారు.

**అద్దె భవనాలపై సమగ్ర నివేదిక**

అద్దె భవనాల్లో ఉన్న గురుకులాల పరిస్థితిపై సమగ్ర నివేదిక సమర్పించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. అవసరమైన మరమ్మతులు నిరంతరం చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో ఎన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయో, యంగ్ ఇండియా పాఠశాలలు పూర్తయ్యాక ఎన్ని తరలించవచ్చో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రాంతీయ సమన్వయకర్తలు వొచ్చే 12 రోజుల్లో అన్ని పాఠశాలలను చెక్స్ ప్రకారం పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పిం చాలని ఆదేశించారు. వొచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లు విద్యార్థులకు సకాలంలో అందించడాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, అద్దెల చెల్లింపులు ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తున్నదని తెలిపారు. మరమ్మతుల నిధులు కూడా విడుదల చేస్తున్న నేపథ్యంలో పనులు క్షేత్రస్థాయిలో వేగంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనుల బిల్లులు అధికంగా క్లియర్ చేసినట్లు తెలిపారు. విద్యా శాఖ పనుల బిల్లుల చెల్లింపులకు డీఎంఎఫ్టీ నిధులను కూడా విని యోగిస్తామని చెప్పారు. విద్యా సంస్థ లకు ఉచిత విద్యుత్ అందుతున్న నేపథ్యంలో స్వంత భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో సోలార్ ప్యానెల్ల ఏర్పాటు కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గురుకులాల ప్రాంతీయ సమ న్వయకర్తలు, ఎస్ఈ, ఎన్పిడిసిఎల్ శ్రీనివాస్, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మిల చేతికి సోలార్ పవర్ ప్లాంట్

- ఇది దేశ చరిత్రలే ప్రథమం
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్క
- రూ.3 కోట్ల విలువైన సోలార్ ప్లాంట్ ప్రారంభించిన మంత్రులు

ఎర్రుపాలెం/మధిర, మే 27 :



మహిళల ఆర్థిక స్వావలంబన ఒక చారిత్రక అడుగని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలం వెంకటాపురం గ్రామంలో బుధవారం పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్‌ను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత కోసం సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి అన్నారు. మహిళా సంఘాల సభ్యులతో సోలార్ పవర్ ప్రాజెక్టులు నిర్మించి, వారి ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్లు, క్యాంటీన్లు, పసుపు బాయిలర్ ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తోందన్నారు. మాదాపూర్ లాంటి ఖరీదైన ప్రాంతాల్లో మహిళా సంఘాల ఉత్పత్తుల కోసం షాపులు కేటాయించడమే కాక రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేల మహిళా సంఘాల భవనాలకు ఒకేరోజు ప్రజా ప్రభుత్వం భూమి పూజ నిర్వహించిందన్నారు. వెంకటాపురంలో మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో సుమారు రూ.3 కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా మహిళా సంఘాలకు రోజుకు రూ.14,000 నుంచి రూ.15,000 వరకు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం భూమిని కేటాయించడమే కాకుండా సబ్సిడీని అందజేస్తోందన్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్తును డిస్కమ్‌లు కొనుగోలు చేసేలా పీపీఏ ఒప్పందాలు కూడా జరిగాయని ఆయన ప్రకటించారు. ప్రతి జిల్లాలోనూ ఇలాంటి సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని, 2030 నాటికి రాష్ట్రంలో 20వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. గతంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితి రూ.5 లక్షల వరకు మాత్రమే ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వం ఈ పరిమితిని రూ.10 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుందని చెప్పారు.

**గ్రీన్ ఎనర్జీ దిశగా**

రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ దిశగా తీసుకెళ్లడంలో ప్రభుత్వం మహిళా సంఘాలను భాగస్వాములను చేస్తోందని భట్టి అన్నారు. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. 202324లో పీక్ డిమాండ్ 15,000 మెగావాట్లు ఉండగా ప్రస్తుతం 18,485 మెగావాట్లకు చేరుకుందన్నారు. ఇంత భారీ డిమాండ్ ఉన్నప్పటికీ ముందస్తు ప్రణాళికల వల్ల ఎక్కడా కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతోందని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఈ ప్రభుత్వాన్ని మహిళలే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. బీఆరఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు.

**అభివృద్ధి పనుల ప్రారంభం**

సుమారు రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఎర్రుపాలెం మండలంలో 132/33 కేవీ సబ్‌స్టేషన్, జమలాపురంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌తోపాటు హెచ్‌పీ పెట్రోల్ బంక్, సోలార్ పవర్ ప్లాంట్, ఇండక్షన్ స్టవ్స్, పసుపు బాయిలర్ ప్లాంట్ వంటివి ఉన్నాయి. కార్యక్రమంలో స్పెషల్ సీ¾ఎస్ దాన కిషోర్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ఖమ్మం కలెక్టర్ దివాకర్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, రెడ్కో వైస్ చైర్మన్ అండ్ ఎండీ అనిల, ఎన్పీడీసీఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, గిడ్డంగుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వనపర్తిలో విషాదం

- అప్పుల భూతానికి ఒకే కుటుంబంలో నలుగురు బలి
- భార్య, పిల్లలను చంపి మామిడి తోట కౌలుదారు ఆత్మహత్య
- చనిపోయే ముందు కన్నీరు పెట్టించే సెల్ఫీ వీడియో, వాయిస్ రికార్డింగ్స్

వనపర్తి, మే 27:

అప్పుల భూతం, వడ్డీ వ్యాపారుల వేధింపులు ఒక నిండు కుటుంబాన్ని బలితీసుకున్నాయి. మామిడి తోటలు కౌలుకు తీసుకున్న ఓ రైతు సరైన దిగుబడులు రాక అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చడానికి ప్రైవేటు బ్యాంకులో ఇంటిని తనఖా పెట్టాడు. రెండు నెలలుగా వాయిదాలు చెల్లించకపోవడంతో ప్రైవేటు రుణ సంస్థ నుంచి ఒత్తిడి ఎక్కువైంది. అదేవిధంగా అప్పులు ఇచ్చిన వారి వేధిం పులు పెరిగాయి. వారి వేధింపులు తట్టుకోలేక భార్య, కుమారుడు, కుమార్తెను తాళ్లతో కట్టేసి తోటలో ఉన్న నీటి సంపులో పడేశాడు. అనంతరం ఉరి వేసుకొని ఆత్మహత్యకుపాల్పడ్డాడు. వనపర్తి జిల్లా ఖిల్లా గణపురం మండలం సల్కేలాపూర్ గ్రామ శివారులో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూర్కు చెందిన మామిడి తోట గుత్తేదారు గగ్గల్ల నరసింహ (36) వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపురంలో మామిడి తోటను నాలుగేళ్లుగా కౌలుకు తీసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంటిపై తీసుకున్న రుణం కిస్తీలు చెల్లించాలని ఒత్తిడి చేసి, మానసికంగా నన్ను ఇబ్బందులకు గురి చేశారు. వేధింపులు తట్టుకోలేక నర్సింహ కుటుంబ సభ్యులను చంపి ఆత్మహత్య చేసుకున్నాడు. నరసింహ భార్య హేమలత (31), కుమారుడు సాయి నిహాల్ (15), సాహితిశ్రీ (13) లను చేతులు కట్టేసి మామిడి తోటలోని సంపులో వేసి ముంచడంతో మృతి చెందారు. నరసింహ ఆత్మహత్య చేసుకునే ముందు అప్పుల బాధతో వేధించిన వారి సమాచారం వివరాలు తెలుపుతూ సెల్ ఫోన్ స్టేటస్ ద్వారా బంధువులకు సమా చారం అందించారు. అతడు ఆత్మహత్య చేసుకునే సమయంలో గద్వాలలోని తన వదిన (భార్య అక్క) అల్లుడు దరిశెల్లికి ఫోన్ చేసి అప్పులు ఇచ్చినవారు వేధింపు లకు గురిచేస్తున్నారని తన కుటుంబ సభ్యులు నీటి సంపులో పడుకున్నారని ఏడుస్తూ తెలిపి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పులు చెల్లించాలని వేధిస్తున్న వారి వివరాలు సెల్ ఫోన్‌లో వాయిస్ రికార్డ్ చేసి స్టేటస్ పెట్టుకున్నాడు. రూ.60 లక్షలు అప్పు ఉంటే రూ. కోటి 20 లక్షలకు పత్రాలు రాయించుకున్నారని ఆరోపించా రు. హోమ్ లోన్ వారు ఇంటి లో ఉన్న ఆభరణాలు, వస్తువులను స్వాధీనం చేసుకొని ఇంటికి నోటీసులు అంటించి ఆవేదనకు గురి చేశారని వాపోయాడు. వడ్డీ వ్యాపారులకు రూ.3 వడ్డీ కడుతూ వచ్చానని అప్పుల భారం మోయలేక, చిత్రహింసలు భరించలేకపోతున్నానని బోరుమన్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మృతుడి కూతురు, కుమారుడిని పాఠశాలలో ఎగతాళి చేస్తున్నారని చదువు మాన్పించి తోటలో పనులు చేయించాడని తెలిపారు. మామిడి తోటకు లక్షల అప్పులు చేసి మందులు వేసి నష్టపోయినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఈ ఘటనను చూసి కన్నీరు మున్నీర య్యారు. సంఘటన స్థలాన్ని డిఎస్పి గిరిబాబు, సిఐ రాంబాబు, ఎస్సై వెంకటేష్ పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై డీఎస్పీ గిరిబాబు మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు అనాలోచిత చర్యల వల్ల జీవితాలు నాశనం చేసుకుంటారని తెలిపారు. నరసింహ మామిడి తోటలను కౌలుకు తీసుకొని అప్పుల వారి ఒత్తిడితో కుటుంబ సభ్యులను నీళ్ల సంపులో ముంచిన అనంతరం ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.





# అక్రమ వలసలపై ఉక్కుపాదం!

## చొరబాటుదారులతో జాతీయ భద్రతకు పెను సవాల్..

**జనాభా మార్పులపై అధ్యయనానికి అమిత్ షా ఉన్నత స్థాయి కమిటీ**

## సరిహద్దుల్లో వలసదారుల క్యూ..

**డిటెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు హోం శాఖ ఆదేశాలు**

దేశంలోకి నానాటికీ పెరుగుతున్న అక్రమ వలసలు, సరిహద్దుల గుండా జరుగుతున్న చొరబాట్లు జాతీయ భద్రతకు, ఆర్థిక వ్యవస్థకు మరియు సామాజిక సమతుల్యతకు పెను సవాలుగా మారాయి. ఈ నేపథ్యంలో అసాధారణ జనాభా మార్పులపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయగా, ఇటు పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపడం ప్రారంభించింది. అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదారులను ఏ విధంగానైతే నిర్దాక్షిణ్యంగా తరిమేసిందో.. ఇప్పుడు భారతదేశం కూడా అదే తరహా కఠినమైన చర్యలకు సిద్ధమైంది. దేశవ్యాప్తంగా అక్రమ వలసలు, ఇతర అసాధారణ కారణాల వల్ల జరుగుతున్న అసహజ జనాభా మార్పుల సరళిని అధ్యయనం చేసేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన వాగ్దానానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారతదేశ సార్వభౌమత్వానికి, జాతీయ భద్రతకు, గిరిజన సమాజాల పరిరక్షణకు ఈ సమస్య ముప్పుగా మారడంతో కేంద్రం ఈ ముందడుగు వేసింది. ఈ ఉన్నత స్థాయి కమిటీకి సుప్రీంకోర్టు విశాంత్ర న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ ప్రభాకర్ నవోలేకర్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కమిటీలో సభ్యులుగా మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి, మరియు జనగణన కమిషనర్ ఉంటారు. హోంశాఖ సంయుక్త కార్యదర్శి ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. ఈ కమిటీ దేశవ్యాప్తంగా మత, సామాజికవర్గాల వారీగా చోటుచేసుకుంటున్న మార్పుల సరళిని సమగ్రంగా విశ్లేషించి, ఈ సమస్యలకు అర్థవంతమైన, విధానపరమైన, కాలపరిమితితో కూడిన పరిష్కారాలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని అమిత్ షా స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో లక్షలాది మంది విదేశీయుల ఓట్లను తొలగించిన నేపథ్యంలో ఈ కమిటీ నివేదిక అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

**బెంగాల్‌లో సువేందు అధికారి సర్కార్ కొరడా!**

పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి సువేందు అధికారి నేతృత్వంలోని ప్రభుత్వం అక్రమ వలసదారులను ఏరివేసే ప్రక్రియను ముమ్మరం చేసింది. గత మమతా బెనర్జీ హయాంలో బంగ్లాదేశ్ నుండి అక్రమంగా చొరబడిన వారు స్థానిక గుర్తింపు పత్రాలు పొంది ఇక్కడి వనరులను వాడుకుంటూ స్థానికులకే సవాల్ విసిరే స్థాయికి చేరారని, వారిపై విదేశీయుల చట్టం కిందే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. "గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి" అనే నినాదంతో బెంగాల్ సర్కార్ వేగంగా ముందుకు వెళ్తోంది. తమ ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకునేలోపే అక్రమ చొరబాటుదారులు రాష్ట్రం విడిచి పారిపోవాలని సీఎం సువేందు అధికారి తీవ్రంగా హెచ్చరించారు. అసలు మనం వారికి ఆశ్రయం ఎందుకివ్వాలని, వారికోసం మన దేశ వనరులను ఎందుకు వృథా చేసుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఈ చొరబాటుదారులేమైనా మన అల్లుళ్లా అంటూ తీవ్ర స్వరంతో నిలదీశారు. భారత్ నుండి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, వారిని తీసుకెళ్లడం ఆ దేశ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. అలాగే చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైలుకు పంపవద్దని కూడా పోలీసులను ఆదేశించారు.

**డిటెన్షన్ సెంటర్లకు తరలింపు.. సరిహద్దుల్లో ఉత్కంఠ**

రాష్ట్రంలోకి అక్రమంగా చొరబడి నివసిస్తున్న బంగ్లాదేశీయులు, రోహింగ్యాలను తక్షణమే నిర్బంధ కేంద్రాలకు తరలించాలని పశ్చిమ బెంగాల్ హోం శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు పట్టుబడిన విదేశీయులు, దేశ బహిష్కరణకు గురైన వారు, జైలు శిక్ష ముగిసి స్వదేశానికి వెళ్లేందుకు ఎదురుచూస్తున్న విదేశీ ఖైదీలను తక్షణమే ఈ కేంద్రాలకు తరలించేందుకు ఆయా జిల్లాల్లో డిటెన్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించింది. బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశ్ అక్రమ వలసదారులు స్వదేశానికి తిరుగుముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున బంగ్లాదేశీయులు గుమిగూడిన దృశ్యాలు కనిపించాయి. కాగా, బెంగాల్ నుంచి పారిపోతున్న అక్రమ వలసదారులు బీహార్, అస్సాం వంటి పొరుగు రాష్ట్రాలలో లేదా హైదరాబాద్ వంటి నగరాలలో తలదాచుకోకుండా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అలర్ట్ కావాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కూడా స్థానికంగా తిష్టవేసిన రోహింగ్యాలను గుర్తించి పంపించివేయాలని భద్రతా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రైవేటు రంగానికి ఫైటర్ జెట్ ఛాన్స్!

- ఏఎమ్‌సీఏ అభివృద్ధికి కేంద్రం చరిత్రాత్మక నిర్ణయం
- టాటా, ఎల్అండ్‌టీ, భారత్ ఫోర్జ్ కన్సార్టియాలకు అవకాశం




**న్యూఢిల్లీ:** అత్యాధునిక యుద్ధ విమానాల తయారీలో స్వావలంబన దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. దేశీయంగా 5వ తరం అత్యాధునిక మధ్యశ్రేణి కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎమ్‌సీఏ) అభివృద్ధి కోసం తొలిసారిగా ప్రైవేటు రంగ సంస్థలకు అవకాశం కల్పిస్తూ కేంద్రం రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) విడుదల చేసింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ఎల్అండ్‌టీ–బీఈఎల్–డైనమాటిక్ కన్సార్టియం, భారత్ ఫోర్జ్–బీఈఎమ్ఎల్–డాటా పాటర్న్స్ కన్సార్టియంలను మలిదశకు ఎంపిక చేసినట్లు సమాచారం. రూ.15 వేల కోట్ల విలువైన ఈ భారీ ప్రాజెక్టు దక్కించుకునే సంస్థలు ఐదు ప్రోటోటైప్ నమూనాలు, ఒక ప్రయోగాత్మక ఫైటర్ జెట్‌ను తయారు చేసే బాధ్యత చేపట్టనున్నాయి. ఫైటర్ జెట్ అభివృద్ధిని వేగవంతం చేయడం, రక్షణ రంగంలో విదేశీ ఆధారాన్ని తగ్గించడం లక్ష్యంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రాజెక్టుకు అవసరమైన నిధులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వం సమకూర్చనుంది. అయితే ఎంపికైన సంస్థలు ఎయిరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ), డీఆర్‌డీఓలతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తిలో 650 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్టింగ్ కాంప్లెక్స్‌లో ఏఎమ్‌సీఏ అభివృద్ధి చేపట్టనున్నారు. ఇప్పటికే 2025లో ఏడీఏ, డీఆర్‌డీఓ సంయుక్తంగా ఆసక్తిగల సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా మొత్తం ఏడు సంస్థలు స్పందించాయి. వాటిలో మూడు సంస్థలను మలిదశకు ఎంపిక చేశారు. ఎంపికైన సంస్థలు తమ బిడ్స్ సమర్పించేందుకు కేంద్రం మూడు నెలల గడువు ఇచ్చింది. వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రాజెక్టు కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశముందని రక్షణ వర్గాలు వెల్లడించాయి.



# నీట్ పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరు అరెస్ట్!

**మహారాష్ట్రకు చెందిన డాక్టర్, కోచింగ్ ఫ్యాకల్టీ అదుపులోకి**

**కేసులో అరెస్టుల సంఖ్య 13కు పెరిగింది**


**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్ యూజీ–2026 ప్రశ్నపత్రాల లీక్ కేసులో సీబీఐ మరో ఇద్దరిని అరెస్టు చేసింది. మహారాష్ట్రకు చెందిన డాక్టర్ మనోజ్ శిరూరే, ప్రముఖ కోచింగ్ సెంటర్ ఫ్యాకల్టీ తేజస్ హర్షద్ కుమార్ షాలను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 13కు చేరింది. సీబీఐ వివరాల ప్రకారం.. మనోజ్ శిరూరే లాతూర్‌లో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. ఓ కోచింగ్ సెంటర్ యజమాని కుమారుడితో పాటు ముగ్గురు విద్యార్థులకు కెమిస్ట్రీ ప్రశ్నపత్రాలు లీక్ చేయడంలో కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రశ్నపత్రాలను మరో నిందితుడు పి.వి. కులకర్ణి నుంచి అతడు పొందినట్లు దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు. మరో నిందితుడు తేజస్ హర్షద్ కుమార్ షా పూణేలోని ప్రముఖ కోచింగ్ సంస్థ 'డాక్టర్ అభంగ్ ప్రభు మెడికల్ అకాడమీ' (ఏపీఎంఏ)లో ఫిజిక్స్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నాడు. ఇప్పటికే కస్టడీలో ఉన్న మనీషా హవల్దార్ నుంచి ఫిజిక్స్ ప్రశ్నపత్రాలను పొందినట్లు సీబీఐ ఆరోపించింది. వీరిద్దరి పాత్రపై మరింత లోతుగా విచారణ కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. కాగా, నీట్ పేపర్ లీక్ ఘటనపై సీబీఐ ఈ ఏడాది మే 12న కేసు నమోదు చేసింది. అనంతరం దేశవ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ముమ్మరం చేసింది. ఇప్పటివరకు ఢిల్లీ, జైపూర్, గురుగ్రామ్, నాసిక్, పూణే, లాతూర్, అహల్యానగర్ తదితర ప్రాంతాల్లో మొత్తం 49 చోట్ల సోదాలు నిర్వహించింది. ఈ కేసుకు సంబంధించి ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ వెల్లడించింది.

# ఎస్ఐఆర్‌కు సుప్రీం గ్రీన్ సిగ్నల్!

**ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిలిపివేయలేమన్న ధర్మాసనం**

**ఎన్నికల కమిషన్ అధికారాలకు అత్యున్నత న్యాయస్థానం మద్దతు**

**న్యూఢిల్లీ:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియకు భారత అత్యున్నత న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సాధారణ ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు భిన్నంగా ఉందనే కారణంతో ఎస్ఐఆర్‌ను నిలిపివేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బిహార్‌లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని సమర్థిస్తూ కీలక తీర్పు వెలువరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చి నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజా ప్రాతినిధ్య చట్టం–1950 ప్రకారం ఎస్ఐఆర్ నిర్వహించే పూర్తి అధికారాలు ఎన్నికల కమిషన్‌కు ఉన్నాయని స్పష్టం చేసింది. 'ఎస్ఐఆర్ ద్వారా సాధించాలనుకుంటున్న లక్ష్యానికి, స్వేచ్ఛాయుతం మరియు నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణ అనే రాజ్యాంగబద్ధ లక్ష్యానికి ప్రత్యక్ష సంబంధం ఉంది. ఈ ప్రక్రియ ప్రస్తుతం అమల్లో ఉన్న ఎన్నికల చట్టాలను ఉల్లంఘించడం లేదు. పైగా ఆర్టికల్ 324 కింద ఎన్నికల కమిషన్‌కు రాజ్యాంగం కల్పించిన బాధ్యతలకు జీవం పోస్తోంది. ఎన్నికల కమిషన్ తన అధికారాలను అతిక్రమించిందని చెప్పలేం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, మే 30 నుంచి దేశంలోని 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో విడత, తుది దశ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష పార్టీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.




# అవసరమైతేనే బయటికి రండి

**పెరుగుతున్న ఎండలపై ప్రధాని హెచ్చరిక!**

**డీహైడ్రేషన్ నుంచి జాగ్రత్తగా ఉండాలన్న మోదీ**

**ఇళ్ల ముందు మట్టికుండల్లో తాగునీరు ఏర్పాటు చేయాలి**



**న్యూఢిల్లీ, మే 27:** దేశవ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు. అనేక రాష్ట్రాల్లో ఎండ తీవ్రత అధికంగా నమోదవుతోందని, దీని ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ప్రధాని మోదీ చేసిన పోస్టులో ప్రజలకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా శరీరం డీహైడ్రేట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తాగునీరు వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉండే మధ్యాహ్న సమయాల్లో అత్యవసరం లేకపోతే బయటకు వెళ్లకుండా ఉండాలని కోరారు. దాహంతో ఉన్న వారికి ఒక గ్లాస్ నీరు అందించడం గొప్ప సేవ అని పేర్కొన్న ప్రధాని.. ఇళ్ల ముందు, దుకాణాల బయట మట్టికుండల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని ప్రజలను కోరారు. ఇతరులకు నీరు అందిస్తూ సేవ చేస్తున్న వారిని అభినందిస్తున్నానని తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని ప్రధాని సూచించారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే వడదెబ్బ వంటి ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని మోదీ పేర్కొన్నారు.



# అనంతుని ఆభరణాలు మాయం!

**పద్మనాభస్వామి ఆలయంలో కలకలం**

**తిరువనంతపురం, మే 27:** శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో బంగారం, వజ్రాల ఆభరణాలు అదృశ్యమైన ఘటన సంచలనంగా మారింది. ఈ విషయాన్ని కేరళ డీజీపీ హోంశాఖకు సమర్పించిన నివేదికలో వెల్లడించారు. నివేదిక ప్రకారం సుమారు 78 గ్రాముల బంగారు, వజ్రాల ఆభరణాలు కనిపించకుండా పోయాయి. వాటిలో 'వైరమ్ నామం' అనే వజ్రాభరణం కూడా ఉంది. మరమ్మతుల కోసం బయటకు తీసుకెళ్లిన ఈ ఆభరణాన్ని తిరిగి ఆలయానికి తీసుకురాలేదని పేర్కొన్నారు. అలాగే బంగారు దీపం కూడా అదృశ్యమైనట్లు సమాచారం. ఆలయ భద్రతలో లోపాలపై డీజీపీ ఆందోళన వ్యక్తం చేస్తూ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విలువైన ఆభరణాలను సురక్షిత ఖజానాల్లో భద్రపరచాలని, కఠిన తనిఖీలు చేపట్టాలని నివేదికలో పేర్కొన్నారు. ఇదిలావుంటే స్వామివారి ఆభరణాలు మాయం కావడంపై భక్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# త్యాగానికి ప్రతీక ఈదుల్ జుహా

**ముస్లింల పవిత్ర పండుగల్లో ఈదుల్ జుహా (బక్రీద్)కు ప్రత్యేక స్థానం ఉంది.**

**నిరుపమాన త్యాగం, దైవభక్తి, విశ్వాసానికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుంది**







ఇస్లామీయ చరిత్ర ప్రకారం హజ్రత్ ఇబ్రహీం ప్రవక్త దైవ ఆజ్ఞకు లోబడి తన ప్రియ కుమారుడు హజ్రత్ ఇస్మాయిల్‌ను త్యాగానికి సిద్ధం కావడం ఈ పండుగకు ప్రధాన నేపథ్యం. దైవ ప్రసన్నత కోసం తండ్రి, కుమారుడు చూపిన భక్తి, త్యాగస్ఫూర్తి మానవాళికి మార్గదర్శకంగా నిలిచింది. దైవ కరుణతో హజ్రత్ ఇస్మాయిల్ స్థానంలో గొర్రెపోతు బలి కావడం ద్వారా ఇబ్రహీం ప్రవక్త విశ్వాసం పరీక్షించబడింది. ఆ మహోన్నత సంప్రదాయానికి కొనసాగింపుగా ముస్లింలు ఈదుల్ జుహా రోజున ఖుర్బానీ నిర్వహిస్తారు. ఖుర్బానీ చేసిన మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని బంధుమిత్రులకు, మరో భాగాన్ని నిరుపేదలకు పంచి, మిగిలిన భాగాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించడం ఈ పండుగలోని సేవా భావాన్ని చాటుతుంది. జిల్‌హజ్ మాసం పదవ రోజున జరుపుకునే ఈ పండుగ సందర్భంగా మక్కాలో హజ్ యాత్ర ప్రధాన ఆరాధనగా జరుగుతుంది. హజ్‌కు వెళ్లలేని విశ్వాసులు తమ ప్రాంతాల్లో ప్రత్యేక నమాజులు చేసి, ఖుర్బానీ ద్వారా దైవభక్తిని వ్యక్తం చేస్తారు. ఉత్కృష్ట త్యాగం ఉన్నతికి మార్గమని, భక్తి భావం బంధాలకన్నా గొప్పదని ఈదుల్ జుహా పండుగ సందేశం ఇస్తుంది.

# ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైన బిజగిరి షరీఫ్ దర్గా

- సర్వమతాల సమ్మేళనానికి ప్రతీకగా నిలిచిన హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి దర్గా
- మత సామరస్యానికి ప్రతీక వైషమ్యాలకు చరమగీతిక
- వేలాదిగా తరలిరానున్న హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి భక్తులు



**జమ్మికుంట మే 27 :** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం బిజిగిర్ షరీఫ్ గ్రామంలోని ప్రముఖ ముస్లిం పుణ్యక్షేత్రం హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి రహ్మతుల్లాహ్ అలై దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రారంభమవు తున్నాయి. వందల ఏళ్ళ నుండి కులమతాలకతీతంగా సర్వమతాలకు వేదికగా కుల,మత,వర్గ,సామాజిక వైషమ్యాలకు అతీతంగా జరిగే ఉర్సు ఉత్సవాలకు వేదికగా నిలుస్తుంది. బిజీగిర్ షరీఫ్ ఉర్సు ఉత్సవాలు బక్రీద్ పండుగ తేది: 28-05-2026 నుండి 30-05-2026 జరుగుతుంది ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి దర్గాను దర్శించుకుంటారు. తమ కష్టాలు తొలగిపోవాలని కోరికలు నెరవేరాలని వేడుకుం టారు. వివిధ జిల్లాల నుండే కాక, మహారాష్ట్రా, ఆంధ్రప్రదేశ్ నుండి కూడా భక్తులు ఉర్సు ఉత్సవాలకు హాజరవుతారు.

**దర్గా ప్రాశస్త్యం:** తెలంగాణాలోనే అత్యంత ప్రముఖ పుణ్యక్షేత్రం బిజిగిరిషరీఫ్ దర్గాను 11వ శతాబ్దంలో నిర్మించినారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ దర్గాలో హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి రహ్మతుల్లాహ్‌అలైతో పాటు ఆయన సోదరుడైన హజ్రత్ సయ్యద్ అజ్మత్ షావలీ వీరి కుమారులైన హజ్రత్ సయ్యద్ ముర్తుజాషావళి, హజ్రత్ సయ్యద్ అక్బర్ షావలి రహమతుల్లా అలై సమాధులున్నాయి. జమ్మికుంట పట్టణానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో విశాలమైన గుట్టలు, ప్రకృతి రమణీయత ఆహ్లాదకరమైన వాతావరణానికి అనుసంధానమై ఈ దర్గా ఉంది. ఇస్లాంతో పాటు అల్లాహ్ సందేశాన్ని దివ్య ఖురాన్ లోనీ సూక్తులను ప్రజలకు తెలియజేస్తు మధ్యయుగాల కాలంలో అరబ్బు దేశం నుండి వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ మానవత్వమే మతం అని విశ్వమానవ సమానత్వాన్ని చాటుతు బిజిగీర్ షరీఫ్ గ్రామం చేరుకొని దర్గాను నిర్మించుకున్న హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి తన జీవిత కాలంలో ప్రదర్శించిన మహిమలు,బాధితుల పట్ల చూపిన కరుణ దయ వల్ల ఎందరో ప్రజలు సుఖ శాంతులలో జీవనం గడుపగలినారు. హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి వర్ధంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా జిల్ హజ్ మాసంలో 10వ తేది: 28-05-2026 నుండి మూడు రోజుల పాటు ఉర్సు ఉత్సవాలు జరుగుతాయి. నిష్టలతో వేడుకునే భక్తుల కోరికలను హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి తీర్చుతారని ప్రసిద్ధి.

**ఉర్సు ఉత్సవాలు:** ఉర్సు ఉత్సవాల సందర్భంగా 28వతేది గురువారం

బక్రీద్ పండుగ రోజున సాయంత్రం గుసుల్ షరీఫ్ కార్యక్రమం నిర్వహిస్తారు. దర్గా ముతావళి మహ్మద్. అక్బర్ అలీ దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో జరిగే చాదర్ గుల్ కార్యక్రమంలో దర్గా ముజావర్లు హైద్రబాద్ నుండి తెచ్చిన చాదర్లు గురువారం తేది 28-05-2026 సాయంత్రం ప్రత్యేకంగా దర్గాలోని సమాధులకు అలంకరించనున్నారు. గురువారం రాత్రి కొత్తగూడెం వాస్తవ్యులైన శ్రీ కీ।శే.గాజి గోవర్దన్ గారి మిత్రబృందం సుమారు మూడువేల మంది భక్తులకు అన్నదానం చేయనున్నారు. గురువారం బక్రీద్ పర్వదినం రాత్రి ముఖ్యఘట్టమైన సంధల్ షరీఫ్ (గ్రంధలేవనం) ను మొల్లపల్లె మరియు పెద్ద బిజిగిర్ షరీఫ్ గ్రామాల నుండి ఉత్సాహపూరిత వాతావరణంలో భక్తుల మేళతాళాల మధ్య సంధల్ ను ఉరేగింపుగా దర్గాకు తీసుకొవచ్చి భక్తిశ్రద్ధలతో సమాధులకు అలరింపజేస్తారు. ఉర్సు సందర్భంగా మహ్మద్ ప్రవక్త ఉపదేశాలను అలపిస్తూ ఖవ్వాలి సమ్మేళనాలు జరుపుతారు. ప్రముఖ ఖవ్వాలి పార్టీ నాందేడ్ కు చెందిన మహ్మద్ సలీమ్,మహరాష్ట్రలోని లాతూర్ పాషా బృందం ఖవ్వాలిలు అలపించనున్నారు..

**భక్తుల నమ్మకం:** ప్రజల భక్తి విశ్వాసాలకు చారిత్రక చిహ్నంగా నిలిచిన ఈ దర్గా పై భక్తులకు ఎనలేని విశ్వాసం ఉంది. దర్గాలో జరిగే ఉర్సు ఉత్సవాలకు హిందు,ముస్లిం, క్రిస్టియన్లు,సిక్కు తదితర అన్ని మతాల భక్తులు హాజరవుతుంటారు. దర్గాషరీఫ్ మన దేశంలోని మత సమ్మేళనానికి ప్రతీకగా నిలుస్తోంది. అనేక రుగ్మతలు దీర్ఘకాలిక రోగాలు,మానసిక రోగాలు నయం కావాలని ఇక్కడ వేడుకుంటారు. ఆరోగ్యం కుదటపడిన తర్వాత "కందుర్లు" పేరిట తమ మొక్కులు తీర్చుకొంటారు. కొత్తగూడెంకు చెందిన భక్తుడు కీ!!శే. గాజి గోవర్ధన్ గారీ మిత్రబృందం వారు గత 19 సంవత్సరాల నుండి ఉర్సు ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్నదానం చేస్తున్నారు.

**ఉర్సు ఉత్సవాలకు హాజరుకానున్న ప్రజాప్రతినిధులు...** దర్గా ఉర్సు ఉత్సవాల కార్యక్రమానికి తేదీ 29-05-2026 శుక్రవారం రోజున ఉదయం హుజురాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితెల ప్రణవ్,జమ్మికుంట తహసిల్దార్ ఎన్ వెంకట్ రెడ్డి,జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న- సదానందం, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగూరి ప్రశాంత్ దిలీప్,జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ ముంతాజ్ అలీ జావిద్,బిజిగిర్ షరీఫ్ గ్రామపంచాయతీ సర్పంచ్ రాచపల్లి వనజ-రాజయ్య,బిజిగిర్ షరీఫ్ గ్రామ కార్యదర్శి ఇంగ్లే రాజు తదితరులు దర్గాలోని సమాధులకు చాదర్లు సమర్పించి ఉత్సవాలలో పాల్గొనున్నారు.

**ఉర్సు ఉత్సవాలకు ప్రత్యేక బందోబస్తు:** ఉర్సు ఉత్సవాలకు పోలీస్ శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఉర్సు ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు హుజురాబాద్ ఏసిపి మాధవి, జమ్మికుంట సిఐ ఎస్ రామకృష్ణ గౌడ్ పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు.

**ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు:** దర్గా ఉర్సు ఉత్సవాలు జరుపుటకు దర్గా ముతవల్లి కమిటీ దర్గాను,చారిత్రాత్మక కట్టడాలకు రంగులు వేయించారు. దర్గాను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతి ఏటా భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు త్రాగునీరు,వైద్యం, పోలీస్ బందోబస్తు,విద్యుత్ సౌకర్యం,జనరేటర్,వసతి, బస్సు సౌకర్యం విస్తృతంగా ఏర్పాట్లను చేస్తున్నట్టు దర్గా ముతవల్లి మహమ్మద్ అక్బర్ అలీ,దర్గా ముతవల్లి కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్,దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం, దర్గా కమిటీ కార్యనిర్వాహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌఫిక్ హుస్సేన్,దర్గా కమిటీ కార్యదర్శి మహమ్మద్ జమాల్ అష్రఫ్,దర్గా కమిటీ సంయుక్త కార్యదర్శి నయిముద్దీన్,షాహుస్సేన్, సర్వర్,సభ్యులు: మహమ్మద్ లతీఫ్ హుస్సేన్, ఇమ్రాన్ హుస్సేన్, ఆజమ్,జలీల్,తాజ్ తదితరులు పాల్గొనున్నారు.

# ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

**నారాయణపేట, మే,27**

బక్రీద్ పండుగ సందర్భంగా నారాయణపేట జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజారోగ్యం, పరిశుభ్రత దృష్ట్యా ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ×గూ సూచించారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు గుర్తించిన ప్రత్యేక వధశాలలు (Slaughtering Houses) వద్ద మాత్రమే వెటర్నరీ వైద్యుల అనుమతి పొందిన పశువులను ఖురేషీలు వధించాలని తెలిపారు. అనుమతి లేని ప్రదేశాల్లో పశువులను వధించడం చట్ట విరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ప్రత్యేక అనుమతులతో ఏర్పాటు చేసిన వధశాలల వివరాలు ఈ విధంగా ఉన్నాయని తెలిపారు:

నారాయణపేట -- భువమ్మ గుట్ట : 01
దామరగిద్ద -- ఎస్సీ వాడా : 01



ఉట్కూరు : 02
చిన్నా పొర్ల : 01
మద్దూర్ : 01
కోస్గి : 01
ధన్వాడ : 01

బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని ఎస్పీ కోరారు. అలాగే పశువుల వధ అనంతరం వచ్చే వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా ప్రత్యేకంగా గన్ని బ్యాగుల్లో సేకరించి గుంతలు తీసి పూడ్చివేయాలని సూచించారు. రోడ్లు, కాలనీలు, ప్రజా ప్రదేశాల్లో వ్యర్థాలను పారవేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు పరిశుభ్రత పాటిస్తూ స్థానిక సంస్థల అధికారులకు సహకరించాలని, ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

# హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

- 24 నియోజకవర్గాల్లో ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణానికి స్థలాల పరిశీలన





**హైదరాబాద్, మే 27 ( :** నగర పేదలకు సొంతింటి కల నెరవేర్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. తొలి విడతలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం మంత్రి అజారుద్దీన్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాంపల్లి, మలక్‌పేట్, బహదూర్‌పురా నియోజకవర్గాల్లో పలు స్థలాలను పరిశీలించారు. నగరంలోని 24 నియోజకవర్గాల్లో ఎల్ఐజీ (తక్కువ ఆదాయ వర్గాల) ఇళ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా కుల్సుంపురా, అఫ్జల్ సాగర్ ప్రాంతాలతో పాటు కాలదేరా, గడ్డియన్నారం ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను కూడా పరిశీలించారు. పేదలకు గౌరవప్రదమైన గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

# మెగాస్టార్ చిరంజీవి ఆరోగ్యంపై తప్పుడు ప్రచారం.. యూట్యూబ్ ఛానళ్లపై కేసు

**హైదరాబాద్ మే,27( :** హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీసులు మెగాస్టార్ చిరంజీవి ఆరోగ్యంపై తప్పుడు ప్రచారం చేస్తున్న యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. చిరంజీవి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారం టూ మార్ఫింగ్ వీడియోలు, బోగస్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో న్యాయవాది ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో భాగంగా వీడియోలు, స్క్రీన్‌షాట్లు పోలీసులకు సమర్పించగా.. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల సమాచారం ప్రకారం.. కొందరు కావాలనే చిరంజీవి బట్టతలతో, తీవ్ర అనారోగ్యంతో ఉన్నట్లు తప్పుడు విజువల్స్ సృష్టించి ప్రచారం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ తప్పుడు ప్రచారం అభిమానుల్లో ఆందోళన కలిగించడంతో పాటు నటుడి ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారూ.

# దేశీయ హైడ్రోజన్ రైలు సేవలకు సిద్ధం

- జింద్--సోనిపట్ మార్గంలో 75 కి.మీ వేగంతో నడవనున్న 10 బోగీల రైలు

**న్యూఢిల్లీ, మే 27(** పర్యావరణహిత రైల్వే సేవల దిశగా భారత రైల్వే కీలక ముందడుగు వేసింది. దేశీయంగా అభివృద్ధి చేసిన హైడ్రోజన్ ఇంధన సెల్ ఆధారిత 10 బోగీల రైలు త్వరలో సేవలు ప్రారంభించనుంది. 1200 కిలోవాట్ల హైడ్రో జన్ ఇంధన సెల్ ఇంజిన్‌తో నడిచే ఈ రైలుకు భారత రైల్వే అనుమతి ఇచ్చింది. హర్యా నాలోని జింద్--సోనిపట్ మార్గంలో ఈ రైలు గరిష్ఠంగా గంటకు 75 కిలోమీటర్ల వేగంతో నడవనుంది. హైడ్రోజన్ ఇంధన సాంకేతికత ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతు ందని, దీనిలో నీటి ఆవిరి మాత్రమే ఉద్గారంగా బయటకు వస్తుందని రైల్వే శాఖ తెలిపిం ది. ఈ ప్రాజెక్టుతో జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాల సరసన భారత్ చేరనుంది. జింద్‌లో హైడ్రోజన్ నిల్వ, ఇంధన నింపే కేంద్రం ఏర్పాటు చేశారు. భద్రత కోసం లీకేజీ గుర్తింపు పరికరాలు, ఫ్లేమ్ డిటెక్టర్లు, 24 గంటల పర్యవేక్షణ, శిక్షణ పొందిన సిబ్బంది వంటి ఏర్పాట్లు చేశారు. భారత రైల్వే పచ్చ ఇంధనం, శక్తి సామర్థ్యం, నెట్ జీరో కార్బన్ లక్ష్యాల సాధనలో ఈ ప్రాజెక్టు కీలకమని రైల్వే మంత్రిత్వ శాఖ పేర్కొంది.

# రాజస్థాన్ సరిహద్దు భద్రతపై అమిత్ షా కీలక సమీక్ష

- అంతర్జాతీయ సరిహద్దుల భద్రతకు కేంద్రం కట్టుబడి ఉంది

**న్యూఢిల్లీ,/ బికనేర్:మే 27(** రాజస్థాన్‌లోని ఇండో-పాకిస్తాన్ సరిహద్దు జిల్లాల భద్రతా పరిస్థితులపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా బికనేర్‌లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజస్థాన్ ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉన్నతాధికారులు, బికనేర్, జైసల్మేర్, బార్మేర్, శ్రీగంగానగర్, ఫలోది జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో అంతర్జాతీయ సరిహద్దుల వద్ద అత్యున్నత భద్రతా ప్రమాణాలు అమలు చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అమిత్ షా స్పష్టం చేశారు. సరిహద్దు జిల్లాల కోసం ప్రజలు, రాష్ట్ర ప్రభుత్వం, భద్రతా సంస్థల భాగస్వామ్యంతో 360 డిగ్రీల భద్రతా వ్యవస్థ రూపొందించాలని నిర్ణయించారు. అంతర్జాతీయ సరిహద్దు నుంచి 15 కిలోమీటర్ల పరిధిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చొరబాట్లు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఉగ్రవాద నిధుల సమీకరణ, భూకబ్జాలు, సరిహద్దు నేరాల నియంత్రణకు బీఎస్ఎఫ్, సీబీడీటీ, ఎన్‌సీబీ, రాష్ట్ర యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు బ్యాంకుల ఆర్థిక లావాదేవీలు, పెద్ద వ్యాపార సంస్థల నిధుల మూలాలు, మ్యూల్ ఖాతాలు, షెల్ కంపెనీలు, నకిలీ ఆధార్ కార్డులపై కఠిన పర్యవేక్షణ చేపట్టాలని అమిత్ షా ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణలో '1930' కాల్ సెంటర్‌ను సమర్థంగా వినియోగించాలని, కొత్త మూడు క్రిమినల్ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రామ్-2ను సమర్థవంతంగా అమలు చేసి సరిహద్దు గ్రామాల్లో మౌలిక వసతులు, చివరి మైలు పాలన, ప్రభుత్వ పథకాల 100 శాతం అమలుపై దృష్టి పెట్టాలని సమావేశంలో నిర్ణయించారు.

# నెహ్రూకు ప్రధాని మోదీ నివాళి

**న్యూఢిల్లీ, మే 27( . :** భారత మాజీ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించిన ప్రధాని మోదీ, "మాజీ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్నాను" అని పేర్కొన్నారు.

చురకలు




# ధాన్యం బస్తాలను వెంటనే మిల్లలకు తరలించాలి

● జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్



**మద్దూర్ మండలం, మే,27() :** జిల్లాలోని కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధ్యానం బస్తాలను వెంటనే లారీల్లో లోడ్ చేయించి మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు,బుధవారం కలెక్టర్ మద్దూరు మండలం దమగ్నాపూర్ గ్రామంలో గల వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి కేంద్రంలోని ధ్యానం తడిసి పోయిందా అని ఆమె అక్కడి నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు.బస్తాలలోని ధాన్యాన్ని స్వయంగా కలెక్టర్ పరిశీలించారు.కొన్ని బస్తాల చివరి భాగం తడిసి పోవడం గమనించిన ఆమె తడిసిన బస్తాలలోని ధాన్యాన్ని మళ్ళీ వేరే బస్తాలలోకి మార్చి లారీల్లో లోడ్ చేయించాలని సివిల్ సప్లై జిల్లా మేనేజర్ సైదులు ను సూచించారు. అక్కడి నుంచే కాంట్రాక్టర్ కు ఫోన్ లో మాట్లాడి మద్దూరు మండలం లో ఉన్న ఒక్కో కొనుగోలు కేంద్రాలనికి మూడు లారీలను తెప్పించి గురువారం సాయంత్రం వరకు కేంద్రంలో ఉన్న ధాన్యం బస్తాలను మిల్లలకు తరలించాలని తెలిపారు

# తాగునీటి వృథాపై కఠిన చర్యలు.. రూ.10 వేల జరిమానా విధింపు




**హైదరాబాద్, మే 27()** జలమండలి సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి హెచ్చరించారు. బంజారా హిల్స్‌లో తాగునీటిని వృథా చేసిన వ్యక్తికి అధికారులు రూ.10 వేల జరిమానా విధించారు.బంజారా హిల్స్ ప్రధాన రహదారిపై వెళ్తున్న సమయంలో రోడ్ నం.12లోని ఆరెంజ్ ట్రీ ఫర్నిచర్ షాప్‌కు చెందిన వ్యక్తి జలమండలి తాగునీటితో ప్రాంగణాన్ని కడుగుతున్నట్లు ఎండీ అశోక్ రెడ్డి గుర్తించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించవద్దని హెచ్చరించారు.అంతేకాకుండా సంబంధిత వ్యక్తికి నోటీసు జారీ చేసి జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. ఎండీ ఆదేశాల మేరకు సంబంధిత వ్యక్తికి రూ.10 వేల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.ప్రజలు తాగునీటిని బాధ్యతాయుతంగా వినియోగించాలని, నీటి వృథాను నివారించాలని జలమండలి ఎండీ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా తాగునీటిని దుర్వినియోగం చేస్తే తగిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# టీబీ ముక్తా భారత్ అభియాన్ ఉచిత ఎక్స్రే క్యాంపు లను సద్వినియోగం చేయనుకోండి..

● యాలాల ప్రాథమిక ఆరోగ్య అధికారి డాక్టర్. రూబీయా నాజ్



**యాలాల మండలం, మే,27( :** టీబీ ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా బుధవారం యాలాల మండలాంలోని అగ్గనూర్ గ్రామములో 145 మందికి, మరియు తిమ్మాయిపల్లి గ్రామాలలో 66 మందికి ఉచిత ఎక్స్రే క్యాంపు నిర్వహించి ఎక్స్రే తీయడం జరిగిందని డాక్టర్. రూబియా నాజ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమే మాట్లాడుతూ, హై రిస్క్ గ్రామలను ఎంపిక చేసి ఈ ఉచిత ఎక్స్రే క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్యాంపు లో పాజిటివ్ వచ్చిన వాళ్లకు 6నెలలు ఉచితంగా టీబీ మందులు అందిస్తామన్నారు ఈ కార్యక్రమములో ఎం.ఎల్.హెచ్.పి డాక్టర్స్ లు డాక్టర్. భువనేశ్వరీ, డాక్టర్. తులజారామ్. డాక్టర్ .స్రవంతి టీబీ సూపెరవైజర్ రహత్,ఏ.ఎన్. ఎంలు వీరమణి, వనితా ఎక్స్రే టెక్నీషియన్ రవి మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

# ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS
● బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు
● సామాజిక మాధ్యమాల్లో వదంతులను నమ్మవద్దు.



**నారాయణపేట, మే, 27( :** బక్రీద్ పండుగను జిల్లా ప్రజలు మత సామరస్యాన్ని కాపాడుకుంటూ ప్రశాంత వాతావరణంలోజరుపుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఖాలా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆయన హృదయపూర్వక బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. ..త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పర్వదినం సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని పోలీస్ శాఖలతో సమన్వయం చేసుకొని పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈద్గాలు, మసీదులు మరియు ప్రార్థనా మందిరాల వద్ద ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట్ల ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్లు, పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.పండుగ సందర్భంగా ప్రజలంతా పరస్పరం ఇతర మతాలను గౌరవించుకుంటూ సామ-రస్యంగా,శాంతియుతంగా తమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీ కోరారు. అలాగే సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు, ఎవరైనా వివాదాస్పద పోస్టులు లేదా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అత్యవసర పరిస్థితుల్లో జిల్లా ప్రజలు 24/7 పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712670399, డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్పీ డాక్టర్ వినీత్ కోరారు.

# వరి ధాన్యం జాప్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేయాలి

● వరి రైతులను తూకం పేరుతో మోసం చేయడం తగదు
● వరి ధాన్యం రవాణా చార్జీలు రైతులపై మోపడం సరికాదు
● సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బుస్స చంద్రయ్య



**దౌల్తాబాద్ మండలం, మే,27( :** వరి ధా న్యం అమ్మబోతే రైతులకు అష్ట కష్టాలు పడక తప్పండ ంలేదని ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యంతో రైతులు వారాల తరబడి కొనుగోలు కేంద్రాలలో పడిగాపులు కాస్తూ నరకయాతన పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బుస్స చంద్రయ్య అన్నారు, బుధవారం దౌల్తాబాద్ మండలంలో వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో కలిసి ఆయన మాట్లాడుతూ తూకం కోసం కుప్పలు పోసిన రాసుల్లోనే ధాన్యం మొలకెత్తుతుందని ధాన్యం కొనుగోలు మందకోడిగా సాగడంతో నెల రోజులకు పైగా పటికాపులు కాయవలసి వస్తుందని వర్షాకాలం వ్యవసాయ పనులు కుంటుపడుతున్నాయన్నారు, నిత్యం వర్షాలు పడడంతో ఆరబెట్టడం, కుప్పలు చేయడం కోసం అదనపు వ్యయప్రయాసాలు పడుతున్నారన్నారు, నిబంధన ప్రకారం ధాన్యం కొనుగోలు చేసే సమయంలో బస్తాకు 41 కిలోల 500 గ్రాములు తూకం ఉండాలి, కానీ ధాన్యం తూకం సమయంలోనే అనేక కారణాలను చూపుతూ మూడు నుంచి నాలుగు కిలోల వరి ధాన్యాన్ని అదనంగా తీస్తూ రైతులను నిలువున ముంచుతున్నారన్నారు. రైతులు పండించిన పంటకు లాభం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐకెపి సెంటర్ల నుండి రైస్ మిల్లులకు వరి ధాన్యాన్ని తరలించేందుకు రైతులే రవాణా చార్జీలు భరించడంతో పండించిన పంట రవాణా చార్జీలకే వెచించవలసి వస్తుందన్నారు. రవాణా చార్జీలు రైతులపై వేయకుండా రవాణా చార్జీలను రైతులకు అందించాలన్నారు.రైతులు వరి కోసి నెల రోజుల పై కావస్తున్న ఇప్పటివరకు దాన్యం అమ్మ లేక నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. అమ్మ పోతే అడవి.. కొనబోతే కొరవి అన్న చందంగా అన్నదాతల పరిస్థితి ఉందన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు పడరాని పాట్లుపడుతున్నారన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటను అమ్ముకుంటే ధాన్యం రైతును నిలువున దోచుకుంటున్నారన్నారు. వరి ధాన్యం రైతులకు ప్రతి సంవత్సరం అమ్ముకునేందుకు కష్టాలు తప్పడం లేదన్నారు. వర్షాలు పడడంతో రైతులు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా దాన్యం కొనుగోలులో జాప్యం చేయకుండా వెంటనే కొనుగోలు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రాములు, మల్లయ్య, వెంకటప్ప, బసప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# లారీలు రాక రోడ్డెక్కిన అన్నదాతలు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రాస్తారోకో.



**రాయపోల్ , మే 27:** ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాక లారీల కొరత మండలంలో ఒకే మిల్లు కేటాయించడంతో ఐకెపి కేంద్రాల్లోనే అకాల వర్షానికి దాన్యం తడిసిపోయిందని ఆందోళన చెందుతూ కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాయపోల్ మండలం కొత్తపల్లి బస్టాండ్ వద్ద రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. గజ్వేల్ - రామాయంపేట రోడ్డు మార్గంలో వాహనాలకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాలలో దాన్యం తడిసి ముద్దయిందని,మండలంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం కొనుగోలు కోసం రోజుల తరబడి ఎదురుచూస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు లారీల కొరత ఏర్పడడంతో వడ్ల తరలింపు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తూ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఖండిస్తున్నారు.ఇప్పటికే రైతులు కోతలు పూర్తి చేసి వడ్లను ఐకేపీ కేంద్రాలకు తీసుకువచ్చి ఆరబోసి కొనుగోలు కోసం పడిగాపులు కాస్తున్నారు. అయితే సరిపడా మిల్లులు, లారీలను ఏర్పాటు చేయకపోవడంతో ధాన్యం కేంద్రాల్లోనే పేరుకుపోతోందని రైతులు వాపోతున్నారు. ఇదే సమయంలో మంగళవారం కురిసిన భారీ వడగండ్ల వానతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి రైతులకు మరింత నష్టం వాటిల్లిందని తెలిపారు.

"జై జవాన్ -- జై కిసాన్" అంటూ రైతుల సంక్షేమం గురించి మాట్లాడే ప్రభుత్వం, రైతుల సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే లారీలను సమకూర్చి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలింపును వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు వచ్చి లారీలను సమకూర్చే వరకు ధర్నా విరమించే ప్రసక్తి లేదని తెలిసి చెప్పడంతో తొగుట సీఐ షేక్ లతీఫ్, తహసిల్దార్ కృష్ణమోహన్, ఎస్సై మానస ధర్నా వద్దకు చేరుకొని లారీలను సమకూర్చి త్వరితగతిన ధాన్యం తరలించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. అలాగే వర్షాకాలం ప్రారంభమవుతుందని సమస్యను వెంటనే పరిష్కరించి సకాలంలో ధాన్యం తరలించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతులు హెచ్చరించారు.

# అకాల వర్షం అన్నదాత ఆగమాగం



**రాయపోల్ , మే 27 :** అకాల వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన ధాన్యం తడిసి అన్నదాతలు ఆగమాగం అవుతున్నారు. ఆరు కాలం కష్టపడి తీరా పంటను విక్రయించే సమయానికి తడిసిపోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.మంగళవారం రాత్రి రాయపోల్ మండలంలో కురిసిన భారీ గాలివాన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తడిపేసి అన్నదాతను ఆవేదనకు గురిచేసింది. ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లలో జాప్యం,మిల్లులు, లారీల కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు అకాల వర్షం మరింత నష్టాన్ని మిగిల్చింది. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన వడ్లు వర్షానికి తడిసి ముద్దవ్వడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.రోజుల తరబడి కొనుగోలు కోసం ఎదురు చూస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో ధాన్యం కేంద్రాల వద్దే పేరుకుపోయిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూకం వేసిన బస్తాలు సైతం వర్షపు నీటిలో తడవడంతో నాణ్యత దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. మిల్లులను అధికంగా కేటాయించకపోవడం, లారీలు సకాలంలో రాకపోవడం, గోనె సంచుల కొరత కారణంగా ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు వాపోతున్నారు.అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. రైతులు తమ కష్టార్జిత పంటను కాపాడుకునేందుకు రాత్రంతా కేంద్రాల వద్దే కాపలా కాస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, వెంటనే ధాన్యం తరలింపును వేగవంతం చేసి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# 99 రోజుల ప్రజా "పాలన-ప్రగతి ప్రణాళిక"లో భాగంగా మహిళలపై జరుగుతున్న నెరలపై అవగాహన కార్యక్రమం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా సంక్షేమ అధికారిణి బి.కృష్ణవేణి



**వికారాబాద్, మే,27(:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ మరియు మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లాలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో 'పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం మరియు పరిష్కార చట్టం, 2013' పై ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా సంక్షేమ అధికారిణిబి. కృష్ణవేణి మాట్లాడుతూ

ప్రభుత్వ కార్యాలయాలు, మరియు ప్రైవేట్ సంస్థలతో పాటు, ఇళ్లల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. అలాగే శారీరక స్పర్శ మరియు లైంగిక వేధింపులు, లైంగిక అనుగ్రహం కోసం డిమాండ్ చేయడం లేదా అభ్యర్థించడం, లైంగిక వ్యాఖ్యలు చేయడం, అశ్లీల చిత్రాలను చూపించడం, లైంగిక స్వభావం గల మాటల ద్వారా ఏదైనా అవాంఛనీయ సంఘటన లేదా మరియు ప్రవర్తనకు సంబంధించి ఫిర్యాదులను పరిష్కరించడమే ఈ, ్రాూాం చట్టం యొక్క ముఖ్య ఉద్దేశమని బాధితులు 90 రోజుల్లో ఇంటర్నల్ కమిటీకి లేదా షీబాక్స్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ చట్టం ప్రకారం, 10 మందికి పైగా మహిళా ఉద్యోగులు పనిచేస్తున్న చోట ఒక అంతర్గత ఫిర్యాదుల కమిటీని (×జజ) ఏర్పాటు చేయాలని అంతర్గత ఫిర్యాదుల కమిటీ (×జజ) లేని చోట, ఫిర్యాదులను స్వీకరించడానికి జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ లేదా డిప్యూటీ కలెక్టర్ ఒక స్థానిక ఫిర్యాదుల కమిటీని (ాజజ) ఉంటుందని అయితే, చాలా మంది అధికారులకు, మరియు సిబ్బందికి ఈ చట్టం గురించి అవగాహన లేకపోవడం దాని వలన మహిళలు పని చేస్తున్న ప్రదేశంలో మహిళలపై కొన్ని కొన్ని సంఘటనలు జరుగుతున్నాయని కావున ప్రతి మహిళలు తాము పని చేస్తున్న ప్రదేశంలో ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు రావాలని పనిచేస్తున్న ప్రదేశంలో భయానికి, బెదిరింపులకు లొంగవద్దని, సవాళ్లను అధిగమించి, ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి మాట్లాడుతూ, ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ (×జజ)ని ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. మహిళలకు భద్రత, రక్షణ మరియు అనుకూలమైన పని వాతావరణాన్ని కల్పించడం ద్వారా వారు అన్ని రంగాలలో రాణించి, పురోగతి సాధించడానికి మరియు మహిళా సాధికారత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మెప్మా కోఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేట్ వ్యక్తుల చేత నిర్వహించబడుతున్న షాపింగ్ మాల్స్ లో కూడా లోకల్ కంప్లయింట్ కమిటీ యొక్క ఆవశ్యకతను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీకాంత్, మహిళ సాధికారత కేంద్ర సిబ్బంది వరలక్ష్మి, రాందాస్, మిషన్ వాత్సల్య సిబ్బంది ఆంజనేయులు, లక్ష్మణ్ ,చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ రాజు నాయక్, సఖి సిబ్బంది యశోద, సుమలత, మహిళా సమైక్య సిబ్బంది, మరియు ప్రైవేట్ కంపెనీ లో పనిచేస్తున్న మహిళా సిబ్బంది మరియు ఓనర్స్ పాల్గొన్నారు

# బక్రీద్(ఈద్-ఉల్-అజ్హా)పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు..

- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్




**వికారాబాద్, మే,27(:** బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పండుగ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ జిల్లాలోని ముస్లిం సోదరు లకు, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనలు సజావుగా సాగేందుకు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు పండుగ రోజు న ఈద్గాలు, మసీదుల వద్ద తగిన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తి లేదా వస్తువును గమని ంచినా, లేదా జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలాంటి సమాచారం ఏదైనా తెలిసినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని లేదా డయల్ 100ని సంప్రదించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బూత్ ల వారీగా బి ఎల్ ఓ లను నియమించుకోవాలి

- జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్




**నారాయణపేట, మే,27( :** రాజకీయ పార్టీల ప్రతినిధులు నియోజక వర్గాలలోని బూత్ ల వారీగా బి ఎల్ వో లను నియమించుకుని ఎస్. ఐ ఆర్. ప్రక్రియకు సహకరి ంచాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక కోరారు. బుధ్ వారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఎస్ ఐ ఆర్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బూత్ స్థాయి ఏజెంట్లు రాజకీయ పార్టీలకు అధికారిక ప్రతినిధులుగా వ్యవహరిస్తారని, అలాగే ఎస్. ఐ ఆర్ కార్యక్రమాల పారదర్శకత ను పర్యవేక్షిస్తారన్నారు. బూత్ స్థాయి ఏజెంట్లు ఇంటింటికి వెళ్లి ఓటర్లను లెక్కించే సమయంలో ఓటర్లతో సమన్వయం చేసుకుంటూ బూత్ స్థాయి అధికారులకు సహాయం చేస్తారని చెప్పారు. మరణించిన ఓటర్లను, వేరే చోటికి మారిన ఓటర్లను, నకిలీ నమోదు లను, హాజరు కానీ అర్హులైన గుర్తించడంలో సహాయ పడతారని తెలిపారు. ఎస్. ఐ ఆర్ విధానాలను అర్థం చేసుకోవడంలో సహాయ పడతారని, వారు నమోదు, తొలగింపు లేదా మార్పుల కోసం ఫారాలను సరిగ్గా ఎలా పూరించాలో పౌరులకు మార్గ నిర్దేశం చేస్తారన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు ను కూడా విస్మరించకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటారని కలెక్టర్ స్పష్టం చేశారు. బూత్ స్థాయి ఏజెంట్లు బూత్ స్థాయి అధికారి, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందని, అలాగే సవరణ సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలకు తప్పక హాజరు కావాల్సి ఉంటుందని, ఓటర్ల జాబితాలలో పారదర్శకత, ఖచ్చితత్వాన్ని మెరుగు పరచడానికి ప్రత్యేక విస్తృత సవరణ కార్యక్రమాలలో బూత్ స్థాయి ఏజెంట్లు చురుగ్గా పాల్గొనాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని, ఇంకా బూత్ స్థాయి ఏజెంట్లను నియమించనీ రాజకీయ పార్టీలు ప్రతినిధులు వెంటనే నియమించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రమేష్, సీ సెక్షన్ అధికారిని జయసుధ, రాజకీయ పార్టీల నాయకులు సలీం,సాగర్, అబ్దుల్ ఖదీర్, వెంకట్రామ్ రెడ్డి, రఘువీర్, పాల్గొన్నారు.



# జనుము విత్తనాల పంపిణీ

**రాయికోడుమే, 27(** జనుము విత్తనాల పంపిణీ ఖరీఫ్ సీజన్ కు సంబంధించి జనుము విత్తనాల పంపిణీ కార్యక్రమం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం - జనుము విత్తనాల పంపిణీ శ రోడ్డు రాయికోడు వద్ద నిర్వహించడం జరిగింది 2.20 ఎకరాలకు ఒక బ్యాగు చొప్పున గరిష్టంగా నాలుగు బ్యాగులు ఇవ్వబడును పంపిణీ కొరకు పట్టా పాస్ పుస్తకం ఆధార్ కార్డు జిరాక్సులు తీసుకువచ్చి పర్మిట్ తీసుకొని షాపు వద్దకు వెళ్లి విత్తనాలు తీసుకోవాలని సూచించార జనుము 40 కేజీ బ్యాగు ధర రూ 3110.జనుము 250 బ్యాగుల వరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సారిక గారు,వ్యవసాయ విస్తరణ అధికారులు శివ,నిఖిల్ మరియు అర్చన, ఆత్మ సిబ్బంది రమేష్,మరియు పలువురు రైతులు పాల్గొన్నారు

# దాడికి బలైన యు-వకుడు



**రాయపోల్,మే 27 :** రాయ-పోల్ మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన శ్యామ్ చారి అనే యువకుడు దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘట న మంగళవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిడిదొడ్డి మండలానికి చెందిన ఓ వ్యక్తికి రాంసాగర్ గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. కాగా, శ్యామ్ చారికి ఆ వివాహితతో గతంలో పరిచయం ఉండటంతో ఆమెను రెండు రోజుల పాటు ఇంటి నుంచి తీసుకెళ్లి అనంతరం తిరిగి ఇంటి వద్ద వదిలినట్లు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో ఇరు కుటుంబాల మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన యువతి కుటుంబ సభ్యులు శ్యామ్ చారిపై దాడి చేసినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందిన అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు 20 మంది గ్రామ-స్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మానస వెల్లడించారు.

# పంట వ్యర్థాలను కాల్చకండి.. నేల సారాన్ని కాపాడండి

- మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ

### రైతులకు ముఖ్య సూచనలు

**మహబూబాబాద్ మే27(.:** వరి కోతల అనంతరం పొలాల్లో మిగిలే వరి కొయ్యకాళ్లు, ఇతర పంట వ్యర్థాలను కాల్చివే యడం వల్ల భూమి సారాన్ని కోల్పోతుందని మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ రైతులను హెచ్చరించింది. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేలలోని కోట్లాది సూక్ష్మజీవులు, జీవరాశులు నశించి భూమి నిస్సారంగా మారుతుందని అధికారులు తెలిపారు. ఈ సూక్ష్మజీవులే యూరియా, డీఏపీ, పొటాష్ వంటి ఎరువులను మొక్కలు గ్రహించే రూపంలోకి మార్చుతాయని పేర్కొన్నారు. ఇవి నశిస్తే ఎరువులు అధికంగా వేసినా మొక్కలకు సరైన పోషకాలు అందవని వివరించారు. వరి కొయ్యకాళ్లు, ఇతర పంట వ్యర్థాలు మంచి సేంద్రియ పదార్థాలని, వాటిని కాల్చకుండా భూమిలో కలపాలని సూచించారు. ప్యాడీ మల్చర్, రోటావేటర్ వంటి యంత్రాల సహాయంతో పంట అవశేషాలను చిన్న ముక్కలుగా చేసి నేలలో కలిపితే భూమిలో సేంద్రియ కర్బనం పెరిగి నేల సారవంత మవుతుందని తెలిపారు. తరువాత సూపర్ ఫాస్ఫేట్, పశువుల మూత్రం లేదా వేస్ట్ డీకంపోజర్‌లలో ఏదో ఒకటి రైతుల సౌకర్యాను సారం చల్లి నీరు పెట్టి కలియదున్నాలని సూచించారు. ఇలా చేయడం వల్ల యూరియా వినియోగం తగ్గడం, భాస్వరం అవసరం తగ్గడం, సూక్ష్మ పోషకాలు మొక్కలకు అందడం, పంటలకు రోగనిరోధక శక్తి పెరగడం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడం సాధ్యమవుతుందని వ్యవసాయ శాఖ తెలిపింది. రైతులు పశువుల ఎరువు, సేంద్రియ ఎరువులు, చెరువు మట్టి వాడకాన్ని కూడా ప్రోత్సహించుకోవాలని సూచించారు. "కన్నతల్లి లాంటి నేలతల్లిని కాల్చకండి.. నేల సారాన్ని కాపాడి అధిక దిగుబడులు పొందండి" అని జిల్లా వ్యవసాయ శాఖ రైతులకు విజ్ఞప్తి చేసింది.

# మహిళల ఆర్థిక సాధికారతకు సోలార్ ప్లాంట్‌లు దోహదం



### కడియం శ్రీహరి

**జనగామ, మే 27( :** మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లిలో నవభారతి మహిళా సమాఖ్య ఆధ్వర్య ంలో ఏర్పాటు చేయనున్న ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్‌కు జిల్లా కలెక్టర్ సం దీప్ కుమార్ ఝాతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. రూ. 3 కోట్ల వ్యయం తో నిర్మించే ఈ ప్లాంట్ ద్వారా మహిళా సమాఖ్యకు నెలకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. మహిళలను సంక్షేమం నుంచి స్వావలంబన వైపు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సోలార్ ప్లాంట్ ద్వారా స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళా సమాఖ్యలకు ఎరువులు, విత్తనాల దుకాణాలు, పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలు అప్పగించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మే 27(** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ, 23 మండలాల్లో ప్రతి మండలానికి 250 ఓటర్ల మ్యాపింగ్ లక్ష్యంగా పెట్టుకుని వందశాతం పూర్తి చేయాలన్నారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, మరణించిన మరియు బదిలీ ఓటర్ల వివరాలను నవీకరించాలని సూచించారు.



# బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని నేడు

..ఈద్గా మైదానంలో ఉదయం ఎనిమిది గంటలకు ప్రత్యేక ప్రార్థనలు

..మైనారిటీ నాయకులు ఎస్.ఎం.గౌసన్,ఆఫ్రోజ్ ఖాన్



**కొడంగల్ మున్సిపల్, (మం)మే,27() :** బక్రీద్ పర్వదినాన్ని పురస్క రించు కొని నేడు కొడంగల్ ఈద్గాలో ఉదయం 8 గంటలకు ప్రత్యేక ప్రా ర్థనలు నిర్వహిం చనున్నట్లు మైనారిటీ నాయకులు ఎస్.ఎం.గౌసన్, అఫ్రో జ్ ఖాన్ తెలిపారు. అ ంతకు ముందు జామే మస్జీద్ నుంచి ఉదయం 7:30 గం టలకు ముస్లిం సోద రులు ర్యాలీగా ఈద్గాకు చేరుకుంటారని తెలిపారు. ఒక వేళ వర్షం వస్తే జామే మస్జీద్ లో ఉదయం 8 గంటలకు, మక్కా మస్జీద్ లో 9 గంటలకు, ఇబ్రహీం మస్జీద్ లో 8:30 గంటలకు, మదరస మస్జీద్ లో ఉదయం 7 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

# 29 మే 2026న వికారాబాద్ ప్రభుత్వ ఏ.టీ.సీ / ఐ.టీ.ఐ లో జాబ్ మేళా

**ప్రిన్సిపాల్ ఆర్ నరేంద్ర బాబు**



**వికారాబాద్, మే,27:** వికారాబాద్ ప్రభుత్వ ఏ.టీ.సీ / ఐ.టీ.ఐ నందు 29 మే 2026 నాడు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ ఆర్.నరేంద్ర బాబు ఓ ప్రకటనలో తెలియజేయడం జరిగింది. ఈ జాబ్ మేళా నందు ఐటీసీ లిమిటెడ్, కేఎల్ గ్రూప్, మహేంద్ర అండ్ మహేంద్ర జహిరాబాద్,మరియు గ్యాంట్రిక్స్, మొదలవు కంపెనీలు పాల్గొనడం జరుగుతుంది,ఈ యొక్క ఉద్యోగాలకు ఎస్ ఎస్ సి, ఐటిఐ, డిప్లమా, మరియు డిగ్రీ ఉత్తీర్ణులు అయిన వాళ్లు అర్హులు,ఈ యొక్క అవకాశాన్ని మన వికారాబాద్ విద్యార్థులు ఉపయోగించుకోవాలని మనవి చేస్తున్నాం, సంప్రదించవలసిన నెంబర్ 9177472488

# పోస్టుమెట్రిక్ స్కాలర్షిప్ల దరఖాస్తులకు చివరి తేదీ 31- 5- 26

● **జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వై. మాధవ రెడ్డి**



**వికారాబాద్, మే,27(:** తెలంగాణ ప్రభుత్వము వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ 2025-26 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాల (పోస్టుమెట్రిక్ స్కాలర్షిప్ మరియు ఫీజు రీయంబర్స్ మెంట్ ) కోసం వికారాబాద్ జిల్లా లోని బి.సి. మరియు ఈ.బి.సి. విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి చివరి తేది 31-05-2026 కావున అర్హతను బట్టి పోస్టుమెట్రిక్ కోర్సులు చదువుతున్న రెన్యువల్ మరియు నూతన (ఫ్రెష్) విద్యార్థిని, విద్యార్థులు తమ వివరాలను ఈ పాస్ వెబ్ సైట్ www.epass.cgg.gov.in లో 31-05-2026 వ తేదీలోగా నమోదు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వై. మాధవ రెడ్డి తెలిపారు మరియు ఈ చివరి అవకాశాన్ని బీసి, మరియు ఈబిసి, విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్ మరియు యాజమాన్య ప్రతినిధులు ఈపాస్ వెబ్ సైట్ ద్వారా తమ కళాశాల విద్యార్థిని విద్యార్థుల వివరాలను నమోదు చేయించుటకు పూర్తి బాధ్యత తీసుకోవలసిందిగా జిల్లా బీసి అభివృద్ధి అధికారి వై. మాధవ రెడ్డి తెలిపారు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వికారాబాద్ జిల్లా

# ఫార్మేషన్ రోడ్డు కోసం పరిశీలించిన అధికారులు,

● **గ్రామ సర్పంచ్ సీ హెచ్ శివయ్య,మండల సీనియర్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డి**



**యాలాల మండలం, మే,27(:** యాలాల మండల్ కేంద్రం లో శివ సాగర్ ప్రాజెక్టు నుండి గోవింద్ర పేట్ చెక్ డ్యామ్ వరకు ఫార్మేషన్ రోడ్డు కోసం పరిశీలించిన అధికారులు ఎఇ, డిఇ, గ్రామ సర్పంచ్ సీ. హెచ్. శివయ్య, యాలాల మండల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డీ, గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఆనందరావు వికారాబాద్ జిల్లా మాజీ కో ఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబ,10వ వార్డ్ నెంబర్ గడ్డం బస్వారాజ్, బుర్ణపూరి పాపయ్య,బుర్ణపూరి నర్సిములు,సత్యప్ప గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు

# బాలసదనం ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

● **కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి, మే 27(** సుల్తానాబాద్‌లో మే 29న ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చేతుల మీదుగా ప్రారంభం కానున్న బాలసదనం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.బుధవారం బాలసదనం, వృద్ధాశ్రమం, తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, బాలసదనం పరిశుభ్రంగా ఉండేలా చూడడంతో పాటు చిన్నారులకు భద్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. వృద్ధాశ్రమంలో వసతులు, ఆహారం, పరిశుభ్రతపై ఆరా తీశారు.తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించిన కలెక్టర్, మీ సేవా దరఖాస్తులను సకాలంలో పరిశీలించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు.తహసీల్దార్ కార్యాలయంలో మధ్యవర్తులకు చోటు లేదని స్పష్టం చేసిన కలెక్టర్, ప్రజలు నేరుగా అధికారులను సంప్రదించాలని తెలిపారు.

# సమర్థవంతంగా విధులు నిర్వహించాలి :వరంగల్ పోలీస్ కమిషనర్



అప్పగించిన పనులను అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలని సీపీ స్పష్టం చేశారు. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ విభాగాల్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ దేవేందర్, హరికృష్ణ సీపీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ కీర్తిప్రతిష్టలు అధికారుల పనితీరుపైనే ఆధారపడి ఉంటాయన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.


# ఆపరేషన్ సతర్క్, నార్కోస్‌లో ఆర్‌పీఎఫ్ ఘన విజయం






**సికింద్రాబాద్ మే27(.:** దక్షిణ మధ్య రైల్వేకు చెందిన రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) 'ఆపరేషన్ సతర్క్' మరియు 'ఆపరేషన్ నార్కోస్' కింద భారీ స్థాయిలో అక్రమ నగదు, మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్ డివిజన్ ఆర్‌పీఎఫ్ సిబ్బంది దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద నుంచి రూ.1.22 కోట్ల లెక్క చూపని నగదును పట్టుకున్నారు. ముంబై జవేరి బజార్ నుంచి సికింద్రాబాద్‌కు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిందితుడిని, నగదును జీఆర్‌పీకి అప్పగించగా, ఆదాయపు పన్ను శాఖ, ఇంటెలిజెన్స్ బ్యూరోలకు సమాచారం అందించారు.అదే విధంగా 'ఆపరేషన్ నార్కోస్'లో నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న మాదకద్రవ్యాల ముఠాను ఆర్‌పీఎఫ్ ఛేదించింది. రూ.41.5 లక్షల విలువైన 83 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒక మహిళతో సహా నలుగురిని అరెస్టు చేసింది. సీసీటీవీ నిఘా, ప్రవర్తనా విశ్లేషణ, డిజిటల్ ట్రాకింగ్ ఆధారంగా పలు స్టేషన్లలో నిర్వహించిన వేగవంతమైన ఆపరేషన్ ద్వారా నిందితులను పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.ఆర్‌పీఎఫ్ సిబ్బంది సేవలను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రశంసించారు.

# మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యం




**బాన్సువాడ, మే 27( :** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మెప్మా, సెర్ప్ ఆధ్వర్యంలో బాన్సువాడ పట్టణం, గ్రామీణ మండలంలో మహిళా సంఘాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాన్సువాడ మండలానికి మంజూరైన మండల మహిళా సమాఖ్య సాముదాయక నిర్వహణ శిక్షణ కేంద్రాన్ని పోచారం శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం బాన్సువాడ మండల సమాఖ్య పరిధిలోని 52 మహిళా సంఘాలకు రూ.6.13 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. అలాగే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకం కింద మంజూరైన 15 మంది లబ్ధిదారుల్లో నలుగురికి చెక్కులు అందజేశారు. తదుపరి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాసుల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 10 మహిళా సంఘాలకు రూ.2 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. బాన్సువాడ పట్టణంలో 18 సంవత్సరాలు పైబడిన అర్హులైన తెల్ల రేషన్ కార్డు మహిళా లబ్ధిదారులకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను అందజేశారు. కార్యక్రమంలో కామారెడ్డి మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి, ఏపీడీ విజయలక్ష్మి, డీపీఎం శ్రీనివాస్, బాన్సువాడ పట్టణ, గ్రామీణ మండల ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# అటవీ భూముల సమస్యలపై కలెక్టర్ ప్రత్యక్ష పరిశీలన

**చెన్నారావుపేట, మే 27:** మండలంలోని ఝల్లి, తిమ్మరాయినిపహాడ్, ఎల్లాయిగూడెం గ్రామాల పరిధిలో ఉన్న అటవీ భూముల సమస్యలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. భూముల హక్కులు, సాగు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారులతో కలిసి ఆరా తీశారు. అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సమస్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని రెవెన్యూ, అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నికిత, నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, డీసీఓ నీరజ, తహసీల్దార్ మహమ్మద్ అబిద్ అలీ, ఏడీ సర్వే ల్యాండ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అధికారులు కట్టుబడి ఉండాలి

**మణుగూరులో జాతీయ వినియోగదారుల & మానవ హక్కుల పరిరక్షణ సమితి వార్షికోత్సవ వేడుకలు**



**మణుగూరు, మే 27()** వినియోగదారుల హక్కులు, మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జాతీయ వినియోగదారుల & మానవ హక్కుల పరిరక్షణ సమితి నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ అధికారులు కట్టుబడి ఉండాలని సూచించారు. జాతీయ వినియోగదారుల & మానవ హక్కుల పరిరక్షణ సమితి 22వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా బుధవారం మణుగూరులో తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి వార్షికోత్సవ డైరీలను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు అందజేశారు.మండల రెవెన్యూ అధికారి నరేష్, సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, సీఐ నాగబాబు, ఎస్సై నగేష్, టీబీజీకేఎస్ నాయకుడు వూకంటి ప్రభాకర్, సీనియర్ జర్నలిస్ట్ పిండిగా వెంకట్‌లను సమితి సభ్యులు సత్కరించారు.

కార్యక్రమం తెలంగాణ స్టేట్ సెక్రటరీ ఎడెల్లి భవాని శంకర్ ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు మందడి సంజీవరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి. ఓదేలు, ఈసంపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, అన్యాయం జరిగితే చట్టపరంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి: ఎమ్మెల్యే గండ్ర





**భూపాలపల్లి, మే 27(. :** రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని మహిళలు ఆర్థికంగా, వ్యాపారవేత్తలుగా ఎదగాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు.మహిళా సంఘాలకు రుణాలు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, గోదాములు, బియ్యం మిల్లుల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. రైతులు పంట వ్యర్థాలు కాల్చవద్దని, పంట మార్పిడిపై దృష్టి పెట్టాలని సూచించారు. గాంధీపురంలో రూ.55 కోట్లతో మోడ్రన్ మార్కెట్ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు.ల్లాలో మక్కల కొనుగోలు 95 శాతం పూర్తిచేసిన అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. ప్రజా పాలన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.



# విప్లవ వీరుడు.. సావర్కర్

**నేడు వినాయక్ దామోదర్ సావర్కర్ జయంతి**

వినాయక్ దామోదర్ సావర్కర్ (1883-1966) భారత స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత ప్రాముఖ్యత గల విప్లవ వాది, రచయిత, హిందుత్వ సిద్ధాంతకర్త. ఆయన బ్రిటిష్ పాలనను వ్యతిరేకించి, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారు. సావర్కర్ కేవలం స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాకుండా, హిందూ జాతీయత భావనకు ప్రాతినిధ్యం వహించిన గొప్ప నాయకుడిగా కూడా గుర్తింపు పొందారు. సావర్కర్ 1883 మే 28న మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో జన్మించారు. చిన్ననాటి నుంచే దేశభక్తితో ప్రేరితమై, బ్రిటిష్ అధికారాన్ని వ్యతిరేకిం చేందుకు సిద్ధపడ్డారు. విద్యాభ్యాసాన్ని పూణేలోని ఫెర్గ్యూసన్ కాలేజీలో పూర్తి చేసిన తరువాత, న్యాయవిద్య కోసం 1906లో లండన్‌కు వెళ్లారు. అక్కడ "ఇండియా హౌస్"లో భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని సమర్థంగా నడిపారు. 1909లో మధన్లాల్ ధింగ్రా లండన్‌లోని బ్రిటీష్ అధికారిని హత్య చేయడం సావర్కర్ ప్రభావంతోనే జరిగింది. అభినవ భారత్ సమాజ్ భారతదేశ స్వాతంత్ర్యానికి అంకితమైన విప్లవ సంస్థను స్థాపించారు. "1857: ఽష్ట్రవ ఖీఆతీర్ ఔఠితీ శీట ×అఽవజూవఅఽవఅఎవ" పుస్తకంలో 1857 తిరుగుబాటును మొదటి స్వాతంత్ర్య సంగ్రామంగా పేర్కొన్నారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పనిచేసి నందుకు అరెస్టు చేసి, అండమాన్ నికోబార్ దీవుల సెల్యులార్ జైలుకు పంపించారు. విడుదలైన ప్పటికీ రాజకీయ కార్యకలాపాలకు బ్రిటిష్ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. సావర్కర్ 1923లో "హిందుత్వ" అనే గ్రంథాన్ని రచించి, హిందూ జాతీయత గురించి వివరించారు. హిందూ మతాన్ని కేవలం మతపర మైన అంశంగా కాకుండా, జాతీయ ఐక్యతకు, సంస్కృతికి కేంద్ర బిందువుగా పేర్కొన్నారు. హిందూ మహాసభను నేతృత్వం వహించి, హిందూ సంఘటనపై ప్రత్యేక దృష్టి సారించారు. 1937లో హిందూ మహాసభ అధ్యక్షుడిగా ఎన్నిక య్యారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటిష్ పాలనపై వ్యతిరేకత వ్యక్తం చేశారు. 1948లో మహాత్మా గాంధీ హత్య కేసులో నిందితుడిగా ఆరోపించ బడ్డారు, కానీ తుది విచారణలో నిర్దోషిగా ప్రకటించ బడ్డారు. ఆయన రచనల్లో...1857 భారత స్వాతంత్ర్య సంగ్రామం -- 1857 తిరుగుబాటును స్వాతంత్ర్య పోరాటంగా విశ్లేషించిన పుస్తకం. హిందూత్వ -- హిందూ జాతీయతపై ఆధారపడిన సిద్ధాంత గ్రంథం. కాలాపాని- అండమాన్ జైలు అనుభవాలపై రచన. సావర్కర్ 1966 ఫిబ్రవరి 26న కన్నుమూశారు. ఆయన జీవితం, హిందూత్వ సిద్ధాంతం, విప్లవ స్ఫూర్తి నేటికీ చర్చనీయాంశంగా ఉన్నాయి. వినాయక్ దామోదర్ సావర్కర్ భారత స్వాతంత్ర్య పోరాటానికి ఎనలేని సేవలు అందించిన నాయకుడు. ఆయన విప్లవ దృక్పథం, రచనలు, హిందూత్వ భావజాలం భారతదేశ రాజకీయ, సామాజిక రంగాలపై ప్రభావాన్ని చూపించాయి. దేశభక్తితో నిండిన ఆయన జీవితం కొత్త తరం ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# జానపద చిత్ర బ్రహ్మ బి.విఠలాచార్య

**నేడు విఠలాచార్య వర్ధంతి**






పాతతరం, కొత్తతరం తరం ఎదైనా తెలుగు సినిమా ప్రేక్షకులకు బి.విఠలాచార్య పేరు పరిచయం చేయాల్సిన అవసరం లేదంటే అతిశయోక్తి కాదేమో. నట సార్వభౌ ముడు నందమూరి, కత్తి వీరుడు కాంతారావు ను సినీ ప్రేక్షకుల హృదయాలలో చిరస్థా యిగా నిలిచిపోయే రీతిలో సినిమాలు తీసి, వారికి మాస్ ఫాలోయింగ్ కల్పించింది విఠలా చార్య అనడంలో అతిశయోక్తి కి తావే లేదేమో. మాయలూ, మంత్రాలూ, ఇంద్ర మహేంద్ర జాలాలు, మానవాతీత శక్తులు, టక్కుటమార విద్యలూ, క్షుద్ర శక్తులు, తన చిత్రాలలో చూపించే సాటి రాని మేటి ప్రతిభా శాలి ఆయన. ఒక చిత్రానికి, మరో చిత్రానికి పోలిక లేకుండా, చిత్ర విచిత్ర వినూత్న ఆలోచనలను సాకారం చేసిన అపూర్వ సన్ని వేశాల సృష్టికర్త ఆయన. అందుకే విఠలాచార్య జానపద చిత్ర బ్రహ్మ గా సుపరిచితుడు. ఆయన సినిమాల్లో నటీ నటులే కాకుండా జంతువులు, పక్షులు, అపరిచిత రూపాలు పాత్ర దారులై ఉండడం విశేషం. దర్శకత్వ ప్రతిభకు తోడు, నిర్మాతగా ప్రేక్షకులను ఆకర్షించే సెట్టింగులను రూపొందించడం ప్రత్యేకం. బి.విఠల ఆచార్య లేదా బి.విఠలా చార్య (జనవరి 20, 1920 - మే 28, 1999) 'జానపద బ్రహ్మ' అని పేరు పొందిన తెలుగు సినిమా దర్శకులు, నిర్మాత. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో 70 చిత్రాలను రూపొందించిన ఆయన 1920 జనవరి 28 న కర్ణాటకలో ఉడిపిలో జన్మించారు. కొంతకాలం సర్కస్ కంపెనీలో జంతువుల ఆలనా పాలనా చూడడం చేత వాటిని తన చిత్రాలలో ఎలా వినియోగించు కోవాలో తర్ఫీదు పొందాడు. ఆయన ఎన్నో జానపద చిత్రాలకు అద్భుతమైన దర్శకత్వం వహించాడు. అప్పటి పరిమితమైన సాంకేతిక పరిజ్ఞానమ-ంతో ఆయన చూపించిన ప్రతిభ అసామాన్య మైనది. చాలా కొద్ది ఖర్చుతో ఆయన కనుల కింపైన జానపద కళా ఖండాలను రూపొందించాడు. 1942 లో చిత్రరంగ ప్రవేశము చేసిన ఆయన నిర్మాతగా డి.శంకర్ సింగ్ తో కలిసి దాదాపు 18 చిత్రాలను తమ మహాత్మా పిక్చర్స్ పతాకముపై నిర్మించారు. వీటిలో సాంఘిక చిత్రాలే అధికం. తొలిసారిగా తెలుగులో 1953లో షావుకారు జానకి ప్రధాన పాత్ర పోషించిన కన్యాదానం చిత్రానికి దర్శకత్వము వహించాడు. క్రమంగా తెలుగులో నిర్మాతగా, దర్శకునిగా కూడా రాణించి అనేక జానపద చిత్రాలను తీశాడు. అయన దర్శకత్వం వహించిన చిత్రాలలో 15 చిత్రాలు నందమూరి తారక రామారావు నటించినవే అందులో 5 చిత్రాలను విఠలాచార్యే స్వయంగా నిర్మించాడు. ఆయన చిత్రాలలో హేతుబద్ధతకు తావే లేదు. 'అదెందుకు, ఎలా జరిగింది?' అన్న ప్రశ్నలు ఉ త్పన్నం కావు. ప్రేక్షకులను ఆహ్లాద పరచడమే ముఖ్యం. తెలుగు చందస్సుకు సంబంధించిన "యమాతారాజభానసలగం" అనే సూత్రాన్ని రాజనాల మాంత్రికుని తాంత్రిక మంత్రంగా పెట్టినా, ప్రేక్షకులు ఆనందించారు, ఆదరించారు. అందుకే ప్రజల నాడిని, వారు ఇష్టపడే అంశాలను దొరికి పుచ్చుకుని, ట్రిక్కులు చేయిం చడంలో అందె వేసిన చేయిగా ఖ్యాతిని గడించాడు. సినిమా నిర్మాణంలో 'పొదుపు'ను ఎలా చేయాలో, అతి తక్కువ ఖర్చుతో ఎలా సినిమా నిర్మించాలో ఆయన కు తెలిసినంత మరెవరికీ తెలియ దేమో. అలా వ్యాపారాత్మక చిత్రాలు చేసి విజయం సాధించి, ఆ కళలో తనకు ఎవరూ సాటి రారని రుజువు చేసుకున్నాడు. ఎన్నెన్నో దృశ్యాలు...అన్నీ ఒకే ఒక సెట్లో ఇమిడి పోయేవి. సామాన్య జనానికీ, సినిమా చూట్టంలో లీనమైపోయే ప్రేక్షకులకు ఈ తేడాలు అక్కర్లేదని విఠలాచార్య విశ్వసించే వారు. అలాగే కాస్ట్యూమ్స్, ఆభరణాలూ, ప్రతి సినిమాకీ మార్చవలసిన అవసరం లేదు ముఖ్యపాత్రకి తప్ప అని నమ్మి చేసి చూపించాడు. 'నటీనటుల కాల్ షీట్లు గల్లంతైతే, వాళ్లని చిలకలుగానో, కోతులుగానో మార్చడం ఆయనకే చెల్లింది' అని ఒక సందర్భంలో కాంతారావు వివరించాడు. కన్యాదానం (1955), పెళ్ళి మీద పెళ్ళి (1959), కనకదుర్గ పూజా మహిమ (1960), బందిపోటు (1963), అగ్గి బరాటా (1966), చిక్కడు దొరకడు (1967), నిన్నే పెళ్ళాడుతా (1968) - ఈ చిత్రానికి కథ, చిత్రానువాదం, బి.విఠలా చార్య, దర్శకత్వం బి.వి.శ్రీనివాస్; భలే మొనగాడు (1968), ఆలీ బాబా 40 దొంగలు (1970), లక్ష్మీ కటాక్షం (1970), విజయం మనదే (1970), రాజకోట రహస్యం (1971), జగన్మోహిని (1978), గంధర్వ కన్య (1979), మదన మంజరి (1980) తదితర చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. విఠలాచార్య ఎంతో దక్షత, బాధ్యత గల నిర్మాత. నటీ నటులకు, టెక్నీషియన్లకు తాను ఇస్తానన్న మొత్తాన్ని విభజించి ప్రతినెలా ఒకటో తేదీకల్లా - చిన్నా, పెద్దా అందరికీ చెక్కులు అందించడం ఆయనకే చెల్లింది. టైముకి ముందుగానే షూటింగ్ పూర్తిచేసి, అనుకున్న తేదీకి సినిమా విడుదల చెయ్యడం ఆయనకే సాధ్యమైంది. అలాగే నటీనటులకి కాల్ షీట్స్ అడ్జస్ట్ చెయ్యడంలో కూడా ఆయన 'నంబర్‌వన్' అనిపించు కునేవాడు. ముందుగా చెబితే, ఒప్పుకున్న డేట్స్‌ని అటూ, ఇటూగా మార్చి చిన్న, పెద్ద నటీనులందిరికీ, సహాయ పడేవాడు. వేషాలకోసం ఆఫీసులకి వెళ్తే విఠలాచార్య వచ్చిన ప్రతీ ఒక్కరినీ తన గదిలోకి పిలిచి, కూచోబెట్టి కాఫీ ఇచ్చి మాట్లాడి పంపించే వాడు. ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న జానపద చిత్ర బ్రహ్మ 1999, మే 28 న 80 యేళ్ల వయసులో మద్రాసులోని కన్ను మూశారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెలుగు ప్రజలకు వరం సురవరం

## నేడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి

**అవి తెలుగు భాషను గుర్తించని, స్థానిక ప్రాంతీయ భాషకు విలువలేని, తెలుగు భాషలో చదువు కోవడానికి కూడా సౌకర్యాలు అంతగా లేని రోజులు. నిజాం పాలకుల నిరంకుశ పాలనలో సామాజిక చైతన్యం దాదాపు శూన్య స్థితిలో స్తబ్ధంగా ఉన్న సమయం. తెలంగాణ ప్రాంతంలో అధికార భాష ఉర్దూ మాధ్యమంలో చదువులు సాగడం, ఉర్దూ లోనే ప్రభుత్వ, వ్యావహారిక కార్యక్రమాలు కొనసాగడం, చదువుకున్న వారు ఉర్దూ చదవటం ఒక హోదా చిహ్నంగా ప్రజలు భావించే కాలం. అప్పుడు రాజభాషగా, పాలనా భాషగా, వ్యవహారభాషగా ఉర్దూ ఉండగా, ఉర్దూ భాషలోనే మీజాన్, జామీన్, రయ్యత్ పత్రికలు వచ్చేవి. అప్పటికి రెండు తెలుగు వార పత్రికలు మాత్రమే 'నీలగిరి' నల్లగొండ జిల్లా నుండి, 'తెలుగు' వరంగల్ జిల్లా నుంచి వెలువడు తుండేవి. అలాంటి నిజాం రాజ్యంలో, ప్రతికూల వాతా వరణంలో తెలుగు పత్రికని స్థాపించడమే ఓ సాహసం. ఉర్దూ, సంస్కృతం, మరాఠీ భాషలు రాజ్యమేలుతున్న నిజాం రాజ్యంలో తెలుగు సాహిత్యం నిలదొక్కు కునేందుకు 'గోలకొండ పత్రిక' బీజం వేసింది.**



హైదరాబాద్ సంస్థానంలోని తెలుగు ప్రజల విజ్ఞానానికి తెలుగులో పత్రికను ప్రారంభించాలని నిశ్చయించారు. అంధకార బంధుర మైన నాటి పరిస్థితులలో గోలకొండ పత్రిక అనే చిరుదివ్వెను వెలిగించి తన బహుముఖ ప్రజ్ఞతో సంస్థలను, ఉద్యమాలను నిర్మించి, ప్రజల చైతన్యాన్ని తట్టిలేపే బృహత్తర కార్యక్రమం ప్రారంభించారు సురవరం ప్రతాపరెడ్డి. మాతృ భాషలో చదువుకొనే అవకాశాలు లేక అంతా ఉర్దూమయమై, నిజాం నిరంకుశ పరిపాలనలో, నిద్రాణ స్థితిలో ఉన్న తెలంగాణను జాగృతం చేయాలన్న సురవరం దీక్ష ఫలితమే...1926 మే 19న గోలకొండ పత్రిక ప్రారంభ నేపథ్యం. ఆ పత్రిక వారానికి రెండు మార్లు వెలువడు తుండేది. పత్రిక నిర్వహణలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. జాతీయ భావాలను ధైర్యంగా ప్రచారం చేశారు. 1947 లో అది దినపత్రికగా మారింది. నిజాంను తన పత్రికలలో ఏకిపారేస్తూ దూకుడుగా వ్యవహరించేవారు సురవరం. ఒక దశలో నిజాం రాజు గోలకొండ సంపాదకీయాలకు భయపడ్డారంటే... ఆయన కలం నిజాం ను ఎంత కలవర పరిచిందో అర్థం చేసుకోవచ్చు.

పత్రిక ఆదర్శాలను గురించి వివరిస్తూ ప్రతాపరెడ్డి ఒక సంపాదకీయంలో... "మేము మా పత్రిక స్థాపన కాలం నుండియు రెండంశములు దృష్టి పథమందుంచు కొని దేశీయులకు సేవ చేయు చున్నాము. మొదటిది ఆంధ్రాభాషా సేవ, రెండవది జాతి, మత, కుల వివక్షత లేక ఆంధ్రులలో సర్వశాఖల వారి యొక్క సత్వరాభి వృద్ధికై పాటుపడుట".

ఈ ఆశయాన్ని నెరవేర్చేందుకే ప్రతాపరెడ్డి క్షణం విశ్రాంతి లేకుండా ఎనలేని కృషి చేశారు. గోలకొండ పత్రికకి సురవరమే సర్వస్వంగా ఉండేవారు. సంపాదకుడి దగ్గర నుంచి ప్రూఫ్ రీడరు వరకూ అన్ని బాధ్యతలూ నెత్తిన వేసుకుని పత్రికను నడిపించే వారు. గోలకొండ ప్రతాపరెడ్డి ప్రతిభకు అద్దం పట్టింది. తెలంగాణ ప్రజానీకాన్ని జాగృత పరచటంలో అద్భుత పాత్రను నిర్వహించింది. గోల్కొండ పత్రిక, దానికి అనుబంధంగా భారతి సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికలను స్థాపించి పత్రికా సంపాదకుడిగా,రచయితగా సేవలు అందించారు. ఆయన రాసిన వ్యాసాలూ, పద్యాలూ, విమర్శలూ, సంపాదకీయాలూ 1000కి మించి ఉంటాయి. ఇతర పత్రికల్లో 100కు పైగా వ్యాసాలు రాసి ఉంటారు. కథానికలూ, కవితలూ రాశారు. పత్రికలో కొన్ని శీర్షికలని స్వయంగా నిర్వహించారు. చిత్రగుప్త, భావకవి, రామ్మూర్తి, యుగపతి సింహ, సంగ్రామసింహ మొదలైన ఎన్నో మారుపేర్లతో ఆయన అసంఖ్యాక రచనలు చేశారు.

1896 మే 28 తేదీన జన్మించిన సురవరం కర్నూలులో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. వెల్లాల శంకరశాస్త్రి వద్ద సంస్కృత కావ్యాలు, వ్యాకరణం చదువు కొన్నారు. నిజాం కాలేజీలో ఎఫ్.ఎ. మద్రాసు ప్రెసిడెన్సి కాలేజిలో బి.ఏ. చదివిన తర్వాత బి.ఎల్. చదివి న్యాయవాద వృత్తిని చేపట్టారు. కాని ఎంతో కాలం ఆ వృత్తిలో ఉ ండలేక పోయారు.

**గాంధీజీ నాయకత్వంలో సాగుతున్న స్వాతంత్ర్య పోరాటం ఆయనను ఆకర్షించింది. తెలంగాణ ప్రజల దైన్యం, దారిద్ర్యం, ప్రాథమిక హక్కులను కూడా నోచుకోని దుస్థితి చూచి చలించి పోయారు. భావుకుడైన రచయితగా, సురవరం కథలు నిజాం కాలం నాటి ప్రజల జీవితాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రించినవి.**

1924లో హైదరాబాద్ లోని రెడ్డి హాస్టల్ కార్యదర్శిగా నియమితులై, ప్రతాపరెడ్డి హాస్టల్ విద్యార్థులలో క్రమశిక్షణ నెలకొల్పి వారిని చైతన్య వంతులను కావించి, నాటి కొత్వాల్ అయిన రాజా బహదూర్ ఆశీస్సులతో 1926 మే 10వ తేదీన 'గోలకొండ' పత్రికను ప్రారంభించారు. పోలీస్ చర్య వరకు ప్రతాపరెడ్డి 'గోలకొండ' పత్రికా సంపాదకులుగా పనిచేసారు. 1930లో మెదక్ జిల్లా జోగిపేటలో జరిగిన మొట్టమొదటి 'ఆంధ్ర మహాసభ'కు అధ్యక్షత వహించారు. కార్యాకలాపాలన్ని తెలుగులోనే జరగాలంటూ తీర్మానం చేయించారు.

**1951లో ప్రతాపరెడ్డి పులిజాల హనుమంతరావు తో కలిసి 'ప్రజావాణి' దినపత్రికను స్థాపించి రెండేళ్ళు నడిపారు. ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి పట్ల ప్రగాఢమైన అభిమానం ఉండేది. ప్రజలలో విజ్ఞాన వికాసానికి గొప్ప రచనలు చేశారు. తెలంగాణా ప్రజల భాషనుకాని, సంస్కృతినిగాని తక్కువ చేసి మాట్లాడితే సహించేవారు కాదు. తెలంగాణలో తెలుగు కవులు లేరన్న ముడుంబ వెంకట రాఘవాచార్య వ్యాఖ్యలకు స్పందించి, 354 మంది తెలంగాణ కవుల పరిచయాలతో కూడిన 'గోల్కొండ కవుల సంచిక'ను విడుదల చేశారు సురవరం.**

ఆయన నిజాం రాష్ట్ర పాలన, మొగలాయి కథలు, సంఘోద్ధరణ, ఉచ్చల విషాదము, గ్రంథాలయము, హిందువుల పండుగలు, హైందవ ధర్మవీరులు, యువజన విజ్ఞానం మొదలైన రచనలు, దాదాపు 40 గ్రంథాలు రచించారు. సురవరం రచించిన 'ఆంధ్రుల సాంఘిక చరిత్రకు 'కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు' లభించింది.



దానిలో దాదాపు వెయ్యేళ్ల ఆంధ్రుల చరిత్రను నమోదు చేశారు. తెలంగాణలో గ్రంథాలయోద్యమంలో ప్రతాపరెడ్డి ప్రముఖపాత్ర వహించారు. 1942లో ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించారు. 1943లో ఖమ్మంలో జరిగిన గ్రంథాలయ మహాసభకు, 1944లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తుకు ఆయనే అధ్యక్షులు.

1952 లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో, మిత్రుల ఒత్తిడిపై వనపర్తి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పక్షాన పోటీచేసి విజయం సాధించారు. కాని రాజకీయాలు ఆయనకంతగా రుచించలేదు. త్యాగము, దేశభక్తి, భాషాభిమానం ప్రజా శ్రేయస్సు పరమార్థంగా జీవించిన సురవరం ప్రతాపరెడ్డి 1953 ఆగష్టు 25న దివంగతులయ్యారు.

**అయన సేవలు అందుకొనని సంస్థ తెలంగాణలో లేదంటే అతిశయోక్తి కాదు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులుగా పనిచేశారు. శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, వేమన ఆంధ్ర భాషా నిలయం, హిందీ ప్రచారసభ తదితర సంస్థల ప్రగతికి ఎంతో కృషి చేశారు. తెలుగు జాతికి అయన చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాదు లోని ట్యాంక్ బండ్ పై ప్రతిష్ఠించిన విగ్రహాలలో సురవరం విగ్రహం ఉంది. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఫారసీ, ఆంగ్ల భాషలలో నిష్ణాతులుగా, పత్రికా సంపాదకులుగా, న్యాయవాదిగా, రచయితగా, సంఘ సంస్కర్తగా, ప్రజా ప్రతినిధిగా, చరిత్ర కారునిగా, పరిశోధకుడుగా, పండితుడుగా, క్రియాశీల ఉద్యమ కారుడుగా బహుముఖాలుగా సాగిన సురవరం ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి అనన్యమైనవి. తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో సురవరం ఒక అధ్యాయం. ఆయన తెలుగు ప్రజలకు వరం..**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఎయిరిండియా సర్వీసుల కోత

**హైదరాబాద్:** జులై, ఆగస్టు నెలల్లో ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించాలనుకునే ప్రయాణికులకు కొన్ని మార్గాల్లో ఎంపికలు తగ్గే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో మార్పులు చేసిన సంస్థ, ఇప్పుడు దేశీయ విమానాల సంఖ్యను కూడా తగ్గించే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న విమాన ఇంధన ధరల ప్రభావం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విమానయాన వర్గాలు చెబుతున్నాయి. జులై, ఆగస్టు నెలల్లో దేశీయ విమాన సర్వీసులను 15 నుంచి 20 శాతం వరకు తగ్గించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఏ మార్గాన్ని పూర్తిగా రద్దు చేయకుండా కేవలం విమానాల రాకపోకల సంఖ్యను మాత్రమే తగ్గించాలని సంస్థ భావిస్తున్నట్లు సమాచారం. దీనివల్ల కొన్ని మార్గాల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉండే విమానాల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. ఈ మార్పులు పూర్తిగా తాత్కాలికమని సంస్థ ప్రతినిధులు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత పాత షెడ్యూల్ ప్రకారం సేవలను మళ్లీ ప్రారంభిస్తామని పేర్కొన్నట్లు సమాచారం. అలాగే షెడ్యూల్ మార్పుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొనే ప్రయాణికులకు ప్రత్యామ్నాయ సౌకర్యాలు కూడా అందించనున్నట్లు సంస్థ తెలిపింది. ఇప్పటికే టికెట్లు బుక్




చేసుకున్న వారికి ప్రత్యామ్నాయ విమానాల్లో సీట్లు కేటాయించడం, అదనపు రుసుము లేకుండా ప్రయాణ తేదీలను మార్చుకునే అవకాశం ఇవ్వడం లేదా పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లించే సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించింది. రాబోయే రెండు నెలల్లో ప్రయాణించేవారు ముందుగానే తమ విమాన షెడ్యూల్ వివరాలను పరిశీలించుకోవడం మంచిదని సూచిస్తున్నారు.



# బంగారం, వెండి స్థిరం

**హైదరాబాద్ :** అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిణామాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ బంగారం, వెండి ధరలు ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వాటాల మార్కెట్లు, కరెన్సీ మార్కెట్లు ఒడిదుడుకులకు గురవుతున్నా విలువైన లోహాలకు మాత్రం డిమాండ్ కొనసాగుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తాజా వివరాల ప్రకారం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,58,880గా కొనసాగుతోంది. అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,45,640గా నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,030గా ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,45,790గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో కిలో వెండి ధర రూ.2,94,900గా నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ.2,84,900గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,94,900గా ఉండగా, బెంగళూరులో కిలో వెండి ధర రూ.2,84,900గా నమోదైంది. బంగారం, వెండి ధరలు అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డిమాండ్, కరెన్సీ మార్పుల ఆధారంగా ఎప్పటికప్పుడు మారే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

# ఉద్యోగులకు భారీ బోనస్




**హైదరాబాద్ :** కృత్రిమ మేధస్సు రంగంలో పెరుగుతున్న అవకాశాల కారణంగా సాంకేతిక రంగ సంస్థలు భారీ లాభాలు నమోదు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ సంస్థ తన సెమీకండక్టర్ విభాగం ద్వారా వచ్చిన లాభాలను ఉద్యోగులతో పంచుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇటీవల త్రైమాసిక కాలంలో సంస్థ ఆదాయం భారీగా పెరగడంతో ఉద్యోగులకు భారీ బోనస్‌లు ప్రకటించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం చిప్ విభాగానికి చెందిన ఒక్కో ఉద్యోగికి దాదాపు రూ.3.3 కోట్ల వరకు బోనస్ అందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఈ విభాగానికి అధిక ఆదాయం వచ్చినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు సేవలు, సర్వర్లు, సమాచార నిల్వ కేంద్రాలు, అధిక సామర్థ్య జ్ఞాపక చిప్‌లకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. ఈ కారణంగా కంపెనీకి భారీ లాభాలు వచ్చినట్లు సమాచారం. అలాగే లాభాల్లో వాటా కోరుతూ ఉద్యోగులు కూడా తమ డిమాండ్లు వినిపించినట్లు తెలుస్తోంది. దీంతో సంస్థ యాజమాన్యం ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కీలక నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. దాదాపు 78 వేల మంది ఉద్యోగులకు సంస్థ లాభాల్లో శాతం మేర బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అదనంగా ఇప్పటికే అమల్లో ఉన్న ప్రోత్సాహక పథకాలను కూడా కొనసాగించనున్నట్లు సమాచారం. అయితే ఇతర విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు తక్కువ స్థాయిలో బోనస్ లభించే అవకాశం ఉన్నట్లు పరిశ్రమ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# వాట్సప్‌లో కొత్త సేవ?




**హైదరాబాద్ :** ప్రముఖ సందేశాల వేదిక వాట్సప్ వినియోగదారులకు కొత్త సేవ అందుబాటులోకి వచ్చిందనే వార్తలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. వినియోగదారులకు అదనపు సౌకర్యాలు అందించేందుకు చందా ఆధారిత సేవను ప్రవేశపెట్టినట్లు సమాచారం. ఈ కొత్త విధానం ద్వారా పలు ప్రత్యేక సదుపాయాలు పొందే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. చందా తీసుకున్న వినియోగదారులకు అనేక అదనపు ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉంటాయని సమాచారం. యాప్ రూపాన్ని మార్చుకునేందుకు పలు ఆకర్షణీయ ఎంపికలు, ప్రత్యేక గుర్తులు, సందేశాలకు వ్యక్తిగత శబ్దాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండనున్నట్లు తెలుస్తోంది. అలాగే ప్రతి చాట్‌కు ప్రత్యేక ధ్వనులను ఎంపిక చేసుకోవడం, కృత్రిమ మేధస్సు ఆధారిత గుర్తులు, ప్రత్యేక చాట్ జాబితా వంటి సదుపాయాలు కూడా అందుబాటులో ఉండే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సేవను ఉపయోగించుకోవాలనుకునే వారు స్వచ్ఛందంగా మాత్రమే చందా తీసుకోవచ్చని చెబుతున్నారు. సాధారణ వినియోగదారులపై దీని ప్రభావం ఉండదని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉచిత సేవలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొంటున్నారు. అయితే ఇలాంటి కొత్త సేవలకు సంబంధించిన అధికారిక వివరాలను వినియోగదారులు సంస్థ ప్రకటించిన సమాచారంతో నిర్ధారించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# బైజూస్ వ్యవస్థాపకుడికి షాక్



**హైదరాబాద్ :** ఒకప్పుడు దేశంలో అత్యంత వేగంగా ఎదిగిన విద్యా సాంకేతిక సంస్థగా గుర్తింపు పొందిన బైజూస్ ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక, న్యాయపరమైన సమస్యలను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు కోట్లాది విద్యార్థులకు ఆన్‌లైన్ విద్యను అందిస్తూ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులను ఆకర్షించిన ఈ సంస్థ ఇప్పుడు వివాదాలతో వార్తల్లో నిలుస్తోంది. కంపెనీ అత్యున్నత స్థాయిలో ఉన్న సమయంలో దాని విలువ భారీ స్థాయికి చేరుకుంది. వ్యవస్థాపకుడు బైజూ రవీంద్రన్ కూడా దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్తల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. అయితే ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. తాజా సమాచారం ప్రకారం సింగపూర్ న్యాయస్థానం ఆస్తులకు సంబంధించిన కోర్టు ఆదేశాలను పాటించలేదనే కారణంతో బైజూ రవీంద్రన్‌కు కోర్టు ధిక్కరణ కేసులో ఆరు నెలల జైలు శిక్ష విధించినట్లు సమాచారం. విద్యా రంగంలో వేగంగా ఎదిగిన ఈ సంస్థ తరువాత పలు కంపెనీల కొనుగోళ్లు, విస్తరణ ప్రణాళికలు చేపట్టింది. ప్రపంచవ్యాప్తంగా విస్తరణ కోసం భారీ మొత్తంలో రుణాలు కూడా తీసుకుంది. అయితే కాలక్రమంలో ఆర్థిక నిర్వహణ, పారదర్శకత, రుణాల చెల్లింపులపై ప్రశ్నలు తలెత్తడంతో పరిస్థితులు సంక్లిష్టంగా మారాయి. అమెరికా, సింగపూర్ వంటి దేశాల్లో పలు న్యాయపరమైన వివాదాలు కొనసాగుతున్నాయి. భారీ రుణాలు, పెరిగిన నష్టాలు, ఆలస్యమైన ఆర్థిక నివేదికలు సంస్థను మరింత ఒత్తిడిలోకి నెట్టినట్లు తెలుస్తోంది.

ఒకప్పుడు వేగవంతమైన ఎదుగుదలకు ప్రతీకగా నిలిచిన ఈ సంస్థ ప్రస్తుతం న్యాయ, ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటూ చర్చనీయాంశంగా మారింది.

# ఆదాయం పెరిగినా.. ఆందోళనలో ఖజానా

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఖజానాకు వస్తున్న ఆదాయంలో వృద్ధి నమోదైనప్పటికీ, పెరుగుతున్న ఖర్చులతో పోలిస్తే రాబడి ఆశించిన స్థాయిలో పెరగడం లేదని ఆర్థిక శాఖ లెక్కలు సూచిస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ ఏడాది మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరాంతానికి రాష్ట్రానికి వివిధ మార్గాల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం రూ.5,45,085.89 కోట్లుగా నమోదైనట్లు సమాచారం. అయితే బడ్జెట్‌లో ప్రతిపాదించిన అంచనాలు, వాస్తవంగా వచ్చిన ఆదాయం మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తున్నట్లు వెల్లడైంది. అంచనాలకు తగ్గట్టుగా ఆదాయం రాకపోవడంతో రాష్ట్రం అధికంగా అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఆదాయంలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయమే ప్రధాన వనరుగా కొనసాగుతోంది. అయితే ఆర్థిక కార్యకలాపాలు మందగించడం వల్ల ఆశించిన స్థాయిలో ఆదాయం పెరగడం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా నిర్మాణ రంగం, స్థిరాస్తి రంగం బలపడితే




రిజిస్ట్రేషన్లు, వస్తు సేవల పన్ను, విక్రయ పన్ను తదితర మార్గాల్లో ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. గత కొన్నేళ్లలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల విభాగం ద్వారా వచ్చిన ఆదాయంలో తగ్గుదల కనిపించినట్లు ఆర్థిక వివరాలు తెలియజేస్తున్నాయి. అలాగే పన్నుల ఆదాయంలో కూడా అంచనాలకు తగ్గట్టుగా వసూళ్లు జరగలేదని తెలుస్తోంది. పన్నేతర ఆదాయం, కేంద్రం నుంచి వచ్చిన ఆర్థిక సహాయ నిధులు కలిపి కూడా రాష్ట్ర ఖజానాకు గణనీయమైన ఆదాయం సమకూరినట్లు సమాచారం. మొత్తంగా పన్నుల ఆదాయం, పన్నేతర ఆదాయం, కేంద్ర సహాయ నిధులు కలిపి రాష్ట్రానికి రూ.5,45,085.89 కోట్ల ఆదాయం లభించినట్లు వెల్లడైంది.

అయితే ఆదాయం పెరుగుతున్నప్పటికీ వ్యయాలు కూడా వేగంగా పెరుగుతుండటంతో భవిష్యత్తులో ఆర్థిక నిర్వహణ కీలకంగా మారే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




# కొత్త జియో ఓటీటీ పాస్ విడుదల

**హైదరాబాద్ :** తక్కువ ధరలో వినియోగదారులకు మెరుగైన వినోద సేవలను అందించే లక్ష్యంతో జియో కొత్త ఓటీటీ పాస్‌ను విడుదల చేసింది. ఒకే రీఛార్జ్ ద్వారా మొబైల్ కనెక్టివిటీతో పాటు పలు వినోద సేవలను అందించే విధంగా 28 రోజుల కాలపరిమితితో ఈ కొత్త ప్యాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సరికొత్త ప్యాక్‌ను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో వినియోగదారులు పొందవచ్చని సమాచారం. అయితే ఈ ప్యాక్‌ను వినియోగించుకోవాలంటే వినియోగదారుల మొబైల్‌లో ఇప్పటికే అమల్లో ఉన్న ప్రాథమిక రీఛార్జ్ ప్యాక్ తప్పనిసరిగా ఉండాలని కంపెనీ తెలిపింది. ఈ కొత్త ప్యాక్ ద్వారా వినియోగదారులకు మొత్తం 15 ప్రీమియం వినోద వేదికల సేవలు లభించనున్నాయి. ఇందులో ప్రముఖ వీడియో వేదికలు, క్రీడా ప్రసారాలు, ప్రత్యేక చిత్రాలు, ధారావాహికలు, అంతర్జాతీయ చిత్రాల సేవలు అందుబాటులో ఉండనున్నట్లు సమాచారం. అలాగే జియో టీవీ ద్వారా వినియోగదారులు 1,000కు పైగా ప్రత్యక్ష ప్రసార టెలివిజన్ ఛానళ్లను వీక్షించే అవకాశం కూడా పొందనున్నారు. వీటిలో 150కు పైగా చెల్లింపు ఆధారిత ఛానళ్లు కూడా అందుబాటులో ఉంటాయని తెలుస్తోంది. తక్కువ ధరలో ఎక్కువ వినోదాన్ని అందించే లక్ష్యంతో ఈ కొత్త ప్యాక్‌ను తీసుకొచ్చినట్లు సమాచారం. దీనిపై వినియోగదారుల్లో ఆసక్తి నెలకొంది.

# క్రెడిట్ కార్డు నగదు జాగ్రత్త

**హైదరాబాద్ :** ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో క్రెడిట్ కార్డుల వినియోగం గణనీయంగా పెరిగింది. అత్యవసర పరిస్థితుల్లో లేదా నగదు కొరత ఏర్పడినప్పుడు చాలా మంది క్రెడిట్ కార్డులను ఏటీఎం కేంద్రాల్లో ఉపయోగించి నగదు తీసుకుంటున్నారు. అయితే ఈ ప్రక్రియ వల్ల ఎదురయ్యే ఆర్థిక ప్రభావాల గురించి చాలామందికి పూర్తి అవగాహన ఉండదు. సాధారణంగా క్రెడిట్ కార్డు ద్వారా కొనుగోళ్లు చేసినప్పుడు బ్యాంకులు కొంతకాలం వరకు వడ్డీ లేకుండా చెల్లింపు సౌకర్యాన్ని కల్పిస్తాయి. కానీ అదే కార్డును ఉపయోగించి ఏటీఎం నుంచి నగదు తీసుకున్న వెంటనే ఆ సౌకర్యం నిలిచిపోతుంది. నగదు తీసుకున్న మొదటి రోజు నుంచే వడ్డీ లెక్కింపు ప్రారంభమవుతుంది. అంతేకాకుండా ఈ నగదు ఉపసంహరణలపై బ్యాంకులు సాధారణ రుణాలతో పోలిస్తే అధిక వడ్డీ రేట్లను అమలు చేస్తాయి. కొన్ని సందర్భాల్లో వార్షికంగా అధిక స్థాయిలో వడ్డీ విధించే అవకాశం కూడా ఉంటుంది. దీనితో పాటు నగదు ఉపసంహరణ రుసుము పేరిట అదనపు చార్జీలు కూడా వసూలు చేస్తారు. ప్రతి లావాదేవీపై నిర్దిష్ట రుసుము లేదా ఉపసంహరించిన మొత్తంలో కొంత శాతం వసూలు చేసే అవకాశం ఉంది. అదనంగా ఈ సేవలపై పన్నులు కూడా వర్తిస్తాయి. ఫలితంగా తక్కువ మొత్తం కోసం తీసుకున్న నగదు కూడా తరువాత భారీ ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉంటుంది. అందుకే అత్యవసర పరిస్థితులు మినహా క్రెడిట్ కార్డు ద్వారా ఏటీఎం కేంద్రాల నుంచి నగదు తీసుకోవడాన్ని వీలైనంత వరకు నివారించాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.



# సన్‌రైజర్స్ ఔట్ రాజస్థాన్ ఇన్!

## ఎలిమినేటర్ మ్యాచ్‌లో హైదరాబాద్‌పై 47 పరుగుల తేడాతో విజయం

**29 బంతుల్లో 97 పరుగులతో విధ్వంసం సృష్టించిన వైభవ్ సూర్యవంశీ**

**చేతులెత్తేసిన సన్ రైజర్స్ బ్యాటర్లు**

**ఐపీఎల్ క్వాలిఫయర్ 2కు దూసుకెళ్లిన రాజస్థాన్ రాయల్స్**

**చండీగఢ్, మే 27:** పీ సీ ఏ న్యూ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగిన ఐ పీ ఎల్ 2026 ఎలిమినేటర్ మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ అద్భుత విజయం సాధించింది. సన్ రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన ఈ నాకౌట్ పోరులో ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి 47 పరుగుల తేడాతో ఘన విజయం సొంతం చేసుకుంది.

### రాజస్థాన్ భారీ స్కోరు

టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకున్న సన్ రైజర్స్ కు రాజస్థాన్ బ్యాటర్లు చుక్కలు చూపించారు. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 243 పరుగుల భారీ స్కోరు సాధించారు. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే ఎ ా ద ్ గా చెలరేగిపోయాడు. కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. సెంచరీకి కేవలం 3 పరుగుల దూరంలో అవుటయ్యాడు. ధ్రువ్ జురెల్ 21 బంతుల్లో 50 పరుగులు సాధించి భారీ స్కోరుకు బాటలు వేశాడు. యశస్వి జైస్వాల్ 29 బంతుల్లో 29 పరుగులు చేశాడు. సన్ రైజర్స్ బౌలర్లలో ప్రఫుల్ హింగె 54 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. నితీశ్ కుమార్ రెడ్డి 12 పరుగులిచ్చి 1 వికెట్, శివాంగ్ కుమార్ 19 పరుగులిచ్చి 1 వికెట్ తీశారు.





### చతికిలబడ్డ సన్ రైజర్స్

244 పరుగుల కఠిన లక్ష్య ఛేదనలో సన్ రైజర్స్ హైదరాబాద్ ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి 19.2 ఓవర్లలో 196 పరుగులకే ఆలౌట్ అయింది. నితీశ్ కుమార్ రెడ్డి 20 బంతుల్లో 38 పరుగులు, సలిల్ అరోరా 21 బంతుల్లో 35 పరుగులు, ఇషాన్ కిషన్ 11 బంతుల్లో 33 పరుగులు చేసి కాసేపు ప్రతిఘటించినా జట్టును విజయ తీరాలకు చేర్చలేకపోయారు. రాజస్థాన్ బౌలర్ల కట్టుదిట్టమైన బంతులకు మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. జోఫ్రా ఆర్చర్ 58 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా 21 పరుగులకు 2 వికెట్లు, సుశాంత్ మిశ్రా 21 పరుగులకు 2 వికెట్లు తీసి సన్ రైజర్స్ పతనాన్ని శాసించారు. ఎలిమినేటర్ మ్యాచ్ కావడంతో పరాజయం పాలైన సన్ రైజర్స్ హైదరాబాద్ టోర్నీ నుంచి శాశ్వతంగా నిష్క్రమించింది. అద్భుత విజయం సాధించిన రాజస్థాన్ రాయల్స్ క్వాలిఫయర్ 2 కు సగర్వంగా అడుగుపెట్టింది.









# ఆర్సీబీ విజయ రహస్యం చెప్పిన భువీ

**హైదరాబాద్ :** రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు ఈ సీజన్‌లో అద్భుత ప్రదర్శనతో ముందుకు దూసుకెళ్తోంది. ముఖ్యంగా జట్టు బౌలింగ్ విభాగంలో కీలక పాత్ర పోషిస్తున్న భువనేశ్వర్ కుమార్ తన అనుభవాలను పంచుకుంటూ జట్టు విజయ రహస్యాలను వెల్లడించారు. గుజరాత్ జట్టుపై కీలక విజయాన్ని నమోదు చేసిన అనంతరం మాట్లాడుతూ గణాంకాలు జట్టుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అయితే వాటిపైనే పూర్తిగా ఆధారపడబోమని స్పష్టం చేశారు. కొత్తగా ఆడే ఆటగాళ్లు చేసే ప్రయోగాలను జాగ్రత్తగా పరిశీలిస్తామని, వారి ఆట తీరును విశ్లేషిస్తామని పేర్కొన్నారు. ప్రత్యర్థి బ్యాటర్లు భారీ షాట్లు ఆడకుండా నియంత్రించడం, వారిని వికెట్ల ముందు చిక్కించుకోవడం లేదా నేరుగా వికెట్లు పడగొట్టడంపై ఎక్కువగా దృష్టి పెడతామని చెప్పారు. తనతో పాటు జోష్ హేజిల్‌వుడ్ అనుభవం కూడా జట్టుకు ఉపయోగపడుతోందని వెల్లడించారు. అలాగే సహాయక సిబ్బంది అందిస్తున్న చిన్నచిన్న సూచనలు కూడా జట్టు విజయానికి ఎంతో తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. వరుసగా రెండోసారి జట్టు ఫైనల్‌కు చేరుకోవడంలో తెరవెనుక పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సీజన్‌లో భువనేశ్వర్ కుమార్ అద్భుత బౌలింగ్ ప్రదర్శన కనబరుస్తూ కీలక వికెట్లు సాధించారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు చరిత్రలో ఇది ఐదోసారి తుది పోరుకు చేరడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది.



# ఆర్సీబీ మరో అరుదైన ఘనత

**అహ్మదాబాద్ :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు సరికొత్త అధ్యాయాన్ని రాస్తూ అద్భుత ప్రదర్శన కొనసాగిస్తోంది. గత ఏడాది తొలిసారి టైటిల్‌ను సొంతం చేసుకున్న ఆర్సీబీ, అదే జోరును కొనసాగిస్తూ 2026 సీజన్‌లో కూడా తుది పోరుకు చేరింది. దీంతో వరుసగా రెండు సంవత్సరాలు ఫైనల్‌కు చేరిన అరుదైన జట్ల జాబితాలో చోటు సంపాదించింది. క్రికెట్ అభిమానులను ఉ ర్రూతలూగిస్తున్న ఈ భారీ టోర్నీలో ఇప్పటివరకు చాలా తక్కువ జట్లు మాత్రమే వరుసగా రెండు సార్లు ఫైనల్‌కు చేరగలిగాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆర్సీబీ తీవ్ర ఒత్తిడిని అధిగమిస్తూ మరోసారి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. దీంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఐపీఎల్ చరిత్రను పరిశీలిస్తే ఈ అరుదైన ఘనతను మొదట చెన్నై జట్టు సాధించింది. ఆ జట్టు మూడు వేర్వేరు సందర్భాల్లో వరుస సీజన్లలో ఫైనల్‌కు చేరి ప్రత్యేక రికార్డు సృష్టించింది. ఆ తర్వాత ముంబై జట్టు, గుజరాత్ జట్టు కూడా వరుసగా రెండు సార్లు తుది పోరులో నిలిచాయి. ఇప్పుడు అదే జాబితాలో బెంగళూరు జట్టు చేరింది. అయితే వరుసగా రెండు సార్లు ఫైనల్‌కు చేరడం ఒక ఘనత అయితే, వరుసగా రెండు టైటిళ్లు గెలవడం మరింత ప్రత్యేకమైన ఘనతగా నిలిచింది. ఇప్పటివరకు ఈ రికార్డును కేవలం చెన్నై, ముంబై జట్లు మాత్రమే సాధించాయి. ఇప్పుడు క్వాలిఫయర్ పోరులో విజయం సాధించి ఫైనల్ చేరిన బెంగళూరు జట్టు కూడా ఆ జాబితాలో చేరుతుందా లేదా అనేది అభిమానుల్లో ఉ త్కంఠ రేపుతోంది.

# ధోనీపై సీఎస్కే కీలక వ్యాఖ్యలు



**చెన్నై :** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు అనగానే అభిమానులకు ముందుగా గుర్తుకొచ్చే పేరు మహేంద్ర సింగ్ ధోనీ. జట్టుతో ఆయనకున్న అనుబంధం ప్రత్యేకమైనదిగా మారింది. అయితే మోకాలి గాయం కారణంగా ప్రస్తుత సీజన్‌లో ధోనీ ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడకపోవడంతో ఆయన భవిష్యత్తుపై చర్చలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో ధోనీ భవిష్యత్తుపై చెన్నై జట్టు ప్రధాన కార్యనిర్వాహక అధికారి కాశీ విశ్వనాథన్ కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ధోనీ జట్టులో ఏ పాత్రలో కొనసాగాలనుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ధోనీ ఆటగాడిగా కొనసాగాలనుకుంటున్నారా, శిక్షకుడిగా బాధ్యతలు తీసుకుంటారా లేదా మార్గదర్శకుడి పాత్రలో కొనసాగుతారా అనేది పూర్తిగా ఆయన వ్యక్తిగత నిర్ణయమేనని పేర్కొన్నట్లు సమాచారం. జట్టుకు సంబంధించిన కీలక నిర్ణయాల్లో ధోనీ అభిప్రాయానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని కూడా వెల్లడించినట్లు తెలుస్తోంది. ధోనీ ఇప్పటివరకు తన విరమణపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయనప్పటికీ, వచ్చే సీజన్ నాటికి జట్టు నిర్వహణలో లేదా సహాయక సిబ్బందిలో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశాలపై చర్చలు సాగుతున్నాయి. జట్టు శిక్షకుడి బాధ్యతలకు కూడా ధోనీ సరైన వ్యక్తి అవుతారని పలువురు మాజీ ఆటగాళ్లు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం.

# పాక్ జట్టులో మరో వివాదం

**లాహోర్ :** పాకిస్థాన్ క్రికెట్ జట్టులో మరోసారి విభేదాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. జట్టు దీర్ఘకాలిక ఫిజియో క్లిఫ్ డీకన్‌ను అకస్మాత్తుగా తొలగించిన నిర్ణయంపై పలువురు సీనియర్ ఆటగాళు , ముఖ్యంగా వేగ బౌలర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని వారు బోర్డును కోరుతున్నట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియాతో జరగనున్న ఒకరోజు అంతర్జాతీయ సిరీస్‌కు ప్రకటించిన సహాయక సిబ్బంది జాబితాలో డీకన్‌కు స్థానం కల్పించలేదు. ఆయన స్థానంలో కొత్త ఫిజియోను నియమించినట్లు సమాచారం. చాలా సంవత్సరాలుగా జట్టుతో కలిసి పనిచేస్తున్న డీకన్‌కు ఆటగాళ్లతో మంచి అనుబంధం ఉన్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా బౌలర్ల శారీరక దృఢత్వం, గాయాల నిర్వహణలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. అయితే జట్టులో తరచూ తలెత్తుతున్న గాయాల సమస్యలపై అసంతృప్తితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ అభిప్రాయంతో ఆటగాళ్లు ఏకీభవించడం లేదని సమాచారం. గాయపడిన ఆటగాళ్ల పునరుద్ధరణ మొత్తం ఫిజియో బాధ్యత కాదని, చిన్న గాయాలను ఆయన సమర్థంగా నిర్వహించేవారని కొందరు ఆటగాళ్లు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో పాకిస్థాన్ జట్టుకు చెందిన పలువురు విదేశీ శిక్షకులు, సహాయక సిబ్బంది మధ్యలోనే వైదొలగడం కూడా చర్చనీయాంశంగా మారింది. ఈ పరిస్థితులు భవిష్యత్తులో అనుభవజ్ఞులైన విదేశీ నిపుణులను ఆకర్షించడంలో ఇబ్బందులు కలిగించే అవకాశముందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

PCB Pakistan Cricket Board



# నమిత వ్యాఖ్యలు వైరల్

తన అందం, అభినయంతో దక్షిణాది ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి నమిత ప్రస్తుతం సినిమాలకు దూరంగా కుటుంబ జీవితాన్ని గడుపుతున్నారు. అయితే గతంలో ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా ప్రముఖ కార్యక్రమంలో పాల్గొన్న అనుభవాలు, సామాజిక మాధ్యమాల్లో ఎదురైన వ్యక్తిగత విమర్శల గురించి ఆమె చెప్పిన విషయాలు ఆసక్తికరంగా మారాయి. ప్రముఖ వినోద కార్యక్రమంలో పాల్గొన్న అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, ఆ కార్యక్రమంలో పాల్గొనే వారికి ప్రధానంగా రెండు మార్గాలు ఉంటాయని ఆమె తెలిపారు. ఒకటి నిజాయితీగా, సహజంగా ఉండటం అని పేర్కొన్నారు. అయితే ఆ మార్గాన్ని ఎంచుకుంటే విమర్శలు, అవమానాలు, వ్యక్తిగత దాడులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. మరోవైపు ప్రేక్షకులు ఏమి చూడాలనుకుంటున్నారో అదే చూపిస్తూ భావోద్వేగాలు లేదా ఇతర అంశాలతో వారిని ఆకట్టుకునే ప్రయత్నం చేయవచ్చని అన్నారు. కానీ అది కొంతవరకు నటనతో కూడుకున్నదని ఆమె అభిప్రాయపడ్డారు. తన వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ తనకు దగ్గరైన వ్యక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటే తాను మౌనంగా ఉండనని స్పష్టం చేశారు. తన కోసం మాత్రమే కాదు, కుటుంబ సభ్యులు, స్నేహితుల కోసం కూడా నిలబడతానని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ఎదురైన విమర్శల గురించి మాట్లాడుతూ కొన్ని వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని వెల్లడించారు. మొదట్లో అలాంటి వ్యాఖ్యలను చూసి మానసికంగా చాలా ఇబ్బంది పడ్డానని చెప్పారు. తన భర్త కూడా వ్యాఖ్యలను నిలిపివేయాలని సూచించారని తెలిపారు. అయితే తరువాత పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. తప్పు చేయనప్పుడు భయపడాల్సిన అవసరం లేదని భావించానని పేర్కొన్నారు. కొందరికి తన వైపు వివరించే ప్రయత్నం చేశానని, కొందరు అర్థం చేసుకున్నారని, మరికొందరు అర్థం చేసుకోలేదని చెప్పారు. అలాగే సామాజిక మాధ్యమాల్లో కొందరు చేసే వ్యక్తిగత వ్యాఖ్యలు చాలా బాధాకరంగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు.



# హెబ్బా ఎదురు చూపులు



చిత్ర పరిశ్రమలో ఎంతో మంది కథానాయికలు వస్తుంటారు, వెళ్తుంటారు. కొందరు ఒక్క చిత్రంతోనే ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదిస్తే, మరికొందరు ప్రతిభ ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేక వెనుకబడిపోతుంటారు. అలాంటి నటీమణుల్లో హెబ్బా పటేల్ కూడా ఒకరుగా చెప్పవచ్చు. హెబ్బా పటేల్ తెలుగులో తన తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె తక్కువ సమయంలోనే ప్రత్యేక అభిమాన వర్గాన్ని సంపాదించుకున్నారు. తరువాత కుమారి 21 ఎఫ్ చిత్రంతో ఒక్కసారిగా భారీ గుర్తింపు దక్కించుకుని యువ ప్రేక్షకుల్లో ప్రత్యేక క్రేజ్ సంపాదించారు. ఆ చిత్రం ఘన విజయం సాధించిన తర్వాత వరుసగా పలు చిత్రాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయారు. మొత్తం పన్నెండు చిత్రాల్లో నటించినా అందులో కొద్ది చిత్రాలే విజయాన్ని అందుకున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. తరువాత అవకాశాలు క్రమంగా తగ్గడంతో ప్రత్యేక గీతాల్లో కూడా కనిపించారు. అయితే వాటి ద్వారా కూడా పెద్దగా గుర్తింపు రాలేదని చెబుతున్నారు. ఇటీవల ఓదెల 2 చిత్రంలో కూడా ఆమె కనిపించారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ తన కొత్త చిత్రాలు, ఫోటోల ద్వారా అభిమానులతో నిరంతరం మమేకమవుతున్నారు. మంచి అవకాశం దొరికితే మరోసారి బలమైన పునరాగమనం చేయాలని ఆమె అభిమానులు ఆశిస్తున్నారు.

# జపాన్‌లో పెద్ది లేనట్లే!




గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన పాన్ ఇండియా స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్దిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ చిత్రాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్న జపాన్ అభిమానులకు ఇప్పుడు ఊహించని షాక్ తగిలింది. మొదట్లో చిత్రబృందం పెద్ది సినిమాను భారతదేశంతో పాటు జపాన్‌లో కూడా అదే రోజున విడుదల చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. గతంలో ఆర్ఆర్ఆర్ సినిమా జపాన్‌లో భారీ విజయం సాధించడంతో అక్కడ రామ్‌చరణ్‌కు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. ఆ సినిమా ద్వారా ఆయన నటనకు జపాన్ ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. దీంతో పెద్ది సినిమాను కూడా జపాన్‌లో ఒకేసారి విడుదల చేస్తే మంచి స్పందన వస్తుందని నిర్మాతలు భావించినట్లు తెలుస్తోంది. జపాన్ అభిమానులు కూడా ఈ వార్తతో ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. అయితే విడుదలకు కొద్ది రోజుల ముందు చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కొన్ని అనివార్య కారణాల వల్ల జపాన్‌లో పెద్ది సేమ్ డే రిలీజ్‌ను నిలిపివేసినట్లు తెలుస్తోంది. దీంతో జూన్ 4న సినిమా అక్కడ విడుదల కాన్లటైంది. అలాగే అక్కడ నివసిస్తున్న భారతీయ ప్రేక్షకులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ అదే రోజు విడుదల జరిగి ఉంటే అంతర్జాతీయ బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయిలో కలెక్షన్లు నమోదు అయ్యే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# చిన్నప్పటి కల నిజమైంది

**కమల్ ఆశీస్సులతో భాగ్యశ్రీ భావోద్వేగం! ■ శివకార్తికేయన్ 'సెయాన'పై పెరుగుతున్న అంచనాలు**

కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్ నటిస్తున్న తాజా చిత్రం 'సెయాన'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. విశ్వనటుడు కమల్ హాసన్ సొంత నిర్మాణ సంస్థలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న భాగ్యశ్రీ బోర్సే తాజాగా కమల్ హాసన్‌ను కలిశారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకుంటూ భావోద్వేగ పోస్ట్ చేశారు. "డియర్ కమల్ హాసన్ సర్.. చిన్నప్పటి నుంచి మిమ్మల్ని చూస్తూ పెరిగాను. ఇప్పుడు అదే చిన్న అమ్మాయి మీ సినిమాలో నటిస్తోంది. మీరు నా తలపై చేయి వేసి ఆశీర్వదించిన ఆ క్షణాలను మాటల్లో చెప్పలేను. మీరు గర్వపడేలా చేస్తానని మాటిస్తున్నా" అంటూ భాగ్యశ్రీ చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'అమరన్' విజయానంతరం శివకార్తికేయన్ కమల్ హాసన్ నిర్మాణ సంస్థలో చేస్తున్న రెండో చిత్రం ఇదే కావడం విశేషం. దర్శకుడు శివకుమార్ మురుగేశన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, మాస్ యాక్షన్, వినోదం సమపాళ్లలో ఉంటాయని చిత్ర బృందం తెలిపింది. ఇప్పటికే షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాను అక్టోబరులో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు సమాచారం. ప్రస్తుతం కమల్-భాగ్యశ్రీ ఫొటోలు, ఆమె చేసిన పోస్ట్ సినీ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి.



# మహేష్‌తో నయన్ కోరిక

దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్న నయనతార తన అందం, అభినయంతో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి భారీ అభిమాన వర్గాన్ని ఏర్పరచుకున్నారు. యువ కథానాయకులతో పాటు సీనియర్ నటులతో కూడా కలిసి నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలోని పలువురు అగ్ర నటులతో నయనతార ఇప్పటికే తెర పంచుకున్నారు. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్ వంటి పలువురు ప్రముఖ నటులతో కలిసి విజయవంతమైన చిత్రాల్లో నటించారు. అయితే సూపర్ స్టార్ మహేష్ బాబుతో మాత్రం ఇప్పటి వరకు ఒక్క సినిమాలో కూడా కలిసి కనిపించలేదు. మహేష్ బాబు, నయనతార కలయికలో చిత్రం రావడానికి గతంలో కొన్ని సందర్భాల్లో చర్చలు జరిగినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరిగింది. అయితే ఆ సమయంలో ఇతర చిత్రాలతో బిజీగా ఉండటం వల్ల కొన్ని అవకాశాలు ముందుకు వెళ్లలేదని సమాచారం. అలాగే నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం కూడా మరో కారణమై ఉండొచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన నయనతార, మహేష్ బాబుతో కలిసి నటించే అవకాశం ఇప్పటి వరకు రాలేదని తెలిపారు. ఒకవేళ అవకాశం వస్తే తప్పకుండా నటిస్తానని ఆమె చెప్పినట్లు సమాచారం. ఈ ఇద్దరి కలయిక ఎప్పుడు తెరపై కనిపిస్తుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# సమ్మర్ హాలిడేస్ టీజర్ విడుదల

ఏ మిడిల్ క్లాస్ బయోపిక్'తో అందరికీ చేరువయ్యాడు నటుడు రోహన్. ఈ సమ్మర్‌లో మరోసారి నవ్వులు పంచేందుకు వచ్చేశాడు. రోహన్, అరుణ్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సమ్మర్ హాలీడేస్'. శ్రీకర్ నాయన్ తెరకెక్కిస్తున్నారు. జయసుధ, వాసుకీ ఆనంద్, రాజీవ్ కనకాల కీలకపాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్ర బృందం పంచుకుంది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com